TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 121 | 10-09-2026 | గురువారం | పేజీలు: 10 | వెల: 3/-



రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- దేశంలో 7 కారిడార్లలో మల్టీ ట్రాకింగ్ పనులకు కేబినెట్ ఆమోదం
- రూ.10,783 కోట్ల వ్యయంతో ప్రాజెక్టులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం
- 5 రాష్ట్రాలు, 14 జిల్లాల మీదుగా సాగనున్న మల్టీ ట్రాకింగ్ లైన్లు
- అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 3, 4 లైన్ల నిర్మాణానికి ఆమోదముద్ర
- ఘటికేసర్-కాజీపేట మధ్య రద్దీ తగ్గించేందుకు 4వ లేన్ నిర్మాణం
- సుమారు 300 కిలోమీటర్ల మేర కొత్తగా పెరగనున్న రైల్వే లైన్ సామర్థ్యం
- సరుకు రవాణా వేగవంతంతో పాటు ప్రయాణికుల నిరీక్షణ సమయం తగ్గుదల
- నిర్మాణం ద్వారా భారీగా పరోక్ష, ప్రత్యక్ష ఉపాధి అవకాశాల లభ్యత



వందేమాతరంపై వార్

- పూర్తి గేయంపై కాంగ్రెస్ అభ్యంతరం
- తొలి రెండు చరణాలకే మద్దతు
- శ్రీనగర్‌లో ఒమర్, ఫరూక్ అబ్దుల్లా
- కాంగ్రెస్ తీరుపై ఎన్‌సీ అసహనం
- మిత్రపక్షాలపై షరతులేంటన్న ప్రశ్న
- కూటమి నిర్ణయాలు గౌరవించాలన్న కాంగ్రెస్
- ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం
- కాంగ్రెస్‌పై భాజపా తీవ్ర విమర్శలు
- మరో ముస్లిం లీగ్‌గా మారిందంటూ వ్యాఖ్యలు

తెలంగాణలో బీజేపీదే అధికారం

- ఉత్తర్‌ప్రదేశ్ తర్వాత తెలంగాణపై బీజేపీ ఫోకస్
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడండి
- బీజేపీ శ్రేణులకు బండి సంజయ్ కీలక పిలుపు
- పోలీసు కేసులకు భయపడొద్దని స్పష్టీకరణ
- 109 కేసులున్నా వెనక్కి తగ్గనన్న బండి
- గడప గడపకు వెళ్లాలని కార్యకర్తలకు సూచన





కాందిశీకుల భూమి ఆక్రమణ...!

చెరబట్టిన భూమి విలువ రూ.15 కోట్ల పైమాటే...!

అంతా మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యుల కనుసన్నల్లోనే...!

రోడ్డు వైడెనింగ్‌లో రూ.38 కోట్లకు పైగా నష్టపరిహారం పొందిన వైనం...!

ఈ భూమి మాదేనంటూ ప్రగల్భాలు పలుకుతున్న ఆక్రమణదారులు...!

ఏ. డీ. సర్వే చేసి వాస్తవాలు నిగ్గు తేల్చాలంటున్న స్థానికులు...!

జిల్లా కలెక్టర్ స్పందిస్తేనే వాస్తవాలు బట్టబయలు...!

దేశ విభజన సమయంలో కాందిశీకులకు సంబంధించిన ఆస్తులుగా మిగిలిన ఇవాక్యూ భూములపై అక్రమార్కుల కన్ను పడింది. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తూంకుంటలోని అత్యంత ఖరీదైన ఇవాక్యూ ప్రాపర్టీని కొందరు యథేచ్ఛగా ఆక్రమించడమే కాకుండా.. సుమారు 1,500 చదరపు గజాల స్థలంలో ఏకంగా 8 అక్రమ షెడ్ల నిర్మాణానికి తెరతీశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో రూ.15 కోట్లకు పైగా విలువైన ఈ భూమిపై ఆక్రమణలు జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

3

ఎస్సీలను బీఆర్ఎస్ అవమానిస్తోంది

- కాంగ్రెస్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం
- తెలంగాణ అసెంబ్లీ వర్షా కాల సమావేశాల మూడో రోజు వాడివేడి చర్చ
- ఎర్రవల్లిలో శుద్ధి కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ వాయిదా తీర్మానం
- ఎస్సీలు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడంపై నిలదీత
- ఎస్సీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని మంత్రి లక్ష్మణ్ ఆరోపణ
- బీఆర్ఎస్ నేతలు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్
- రాష్ట్రం వచ్చినా ఎస్సీలపై వివక్ష కొనసాగుతోందని ఆవేదన
- స్పీకర్ ఘటనపై కూడా బీఆర్ఎస్‌కు పశ్చాత్తాపం లేదని మండిపాటు
- మంత్రి ప్రసంగానికి బీఆర్ఎస్ సభ్యుల అడ్డంకులు, నినాదాలు



హైదరాబాద్, (డీడీ9 వార్త):

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఎస్సీలను తీవ్రంగా అవమానిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ధ్వజమెత్తారు. తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు మూడో రోజు మిగతా 2లో..

బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్

- సెషన్ ముగిసే వరకు బీఆర్ఎస్ సభ్యులపై వేటు
- కేటీఆర్, హరీశ్‌రావు సహా 19 మంది సస్పెండ్
- శ్రీధర్‌బాబు సిఫారసుతో నిర్ణయం
- సభలో 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు
- సభా కార్యకలాపాలకు అడ్డుతగిలిన బీఆర్ఎస్ సభ్యులు
- స్పెన్షన్ ప్రతిపాదించిన శ్రీధర్‌బాబు
- స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలు
- మార్షల్స్ అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- దొరతనం పోకడలను భరించబోమన్న భట్టి



హైదరాబాద్, (డీడీ9 వార్త):

తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు బీఆర్ఎస్‌కు చెందిన 19 మంది సభ్యులను సస్పెండ్ చేశారు. సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ సభ్యులు 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు సిఫారసు మేరకు స్పీకర్ ఈ సస్పెన్షన్ ప్రకటించారు. కేటీఆర్, హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, ప్రశాంత్‌రెడ్డి, మర్రిరాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, జగదీశ్‌రెడ్డి, అనిల్ జాదవ్, సుధీర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, కోవా లక్ష్మి, సునీత లక్ష్మారెడ్డిని మిగతా 2లో..

శాంతి భద్రతలపై గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వెల్లడి
- గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం
- రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణత, కాంగ్రెస్ పాలనా వైఫల్యాలపై ఫిర్యాదు
- వంద రోజుల్లో అమలు చేస్తామన్న 420 హామీల ఉల్లంఘనపై వివరణ
- వెయ్యి రోజులైనా అమలుకు నోచుకోని బాండ్ పేపర్ హామీలు
- రైతుబంధు నిలిపివేత, యూరియా కొరత, రైతు బీమా ఎగవేతపై ఆవేదన
- నిరుద్యోగులకు జరిగిన మోసంపై గవర్నర్‌కు పూసగుచ్చినట్లు వివరణ
- సబితా ఇంద్రారెడ్డిపై పోలీసుల దాడి, అవమానానికి సంబంధించిన ఆధారాలు అందజేత
- బాధితులపైనే దాడులు చేసి కేసులు పెట్టారంటూ నిరసన
- సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదని వెల్లడి

హైదరాబాద్, (డీడీ9 వార్త):

రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర శాంతి భద్రతల సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై గవర్నర్‌కు పూసగుచ్చినట్లు ఫిర్యాదు చేశామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వెల్లడించారు. గవర్నర్‌తో సమావేశం

శాంతి భద్రతలపై గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

మొదటిపేజీ తరువాయి

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపిందని విమర్శించారు. వంద రోజుల్లోనే అన్ని పథకాలు అమలు చేస్తామని డిక్లరేషన్లు, అఫిడవిట్లు, బాండ్ పేపర్లు ఇచ్చి 420 హామీలతో ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా కనీస హామీలు నెరవేర్చలేకపోయిందని స్పష్టం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు విడుదల చేశామని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులకు కనీసం యూరియా కూడా దొరకడం లేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బీమాను ఎగ్గొట్టి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారని, నిరుద్యోగులను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌కు నల్ల చొక్కాలు వేసుకుని వెళ్లి నట్లే, తాము కూడా వెయ్యి రోజుల కాంగ్రెస్ వైఫల్య పాలనకు నిరసనగా నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లామని తెలిపారు.

అసెంబ్లీ వద్ద నిరసన తెలిపిన బీఆర్ఎస్ శాసనసభ్యులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని కేటీఆర్ ఆరోపించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై పోలీసులు దాడి చేసి అవమానించిన తీరును తీవ్రంగా తప్పుపట్టిన ఆయన, దానికి సంబంధించిన పూర్తి ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్లు చెప్పారు. తమ పార్టీ నేతలపై దాడులు చేసి, తిరిగి తమపైనే అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ఈ దాడులపై పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం కేసు కూడా నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



కేసీఆర్ క్షేమాన్నే కోరుకున్నాం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు
- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన కాంగ్రెస్ చీఫ్
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరణాన్ని కాంగ్రెస్ కోరుకోలేదని స్పష్టత
- కేసీఆర్‌కు చెడు జరగాలని హరీశ్‌రావు పూజలు చేశారని కవితే అన్నారు
- కేసీఆర్ కిందపడితే గ్రీన్ ఛానల్ ద్వారా వైద్యం అందించాం
- ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి రావాలని మేం కోరుకుంటున్నాం
- కేసీఆర్ ఫామ్‌హౌస్ దగ్గర 55 మంది సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశాం
- ఎమ్మెల్సీ తాతా మధు దళిత సమాజాన్ని అవమానించేలా ప్రవర్తించారు





హైదరాబాద్, (డీడీ9 వార్త):

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ చెడుగా ఆలోచించలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన అల్లుడు, ఎమ్మెల్యే హరీశ్ రావు పూజలు చేశారని స్వయంగా కేసీఆర్ కుమార్తె కవిత చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఏ రోజూ ఎవరి చెడునూ కోరుకోదని, ప్రతిపక్ష నేతకు ఇవ్వాల్సిన గౌరవాన్ని ఎల్లప్పుడూ ఇస్తుందని తేల్చిచెప్పారు. గతంలో కేసీఆర్ బాత్‌రూమ్‌లో జారి పడి గాయపడినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి అత్యవసర వైద్యం అందించిన విషయాన్ని కాంగ్రెస్ నేతలు ప్రస్తావించారు. అసెంబ్లీ సమావేశాల సమయంలోనూ కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి రేవంత్ రెడ్డి ఆరా తీశారని తెలిపారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండి అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి మాత్రమే మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రస్తుతం కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద ప్రభుత్వం 55 మంది సిబ్బందితో భారీ సెక్యూరిటీని ఏర్పాటు చేసిందని టీపీసీసీ చీఫ్ వెల్లడించారు. బీఆర్ఎస్ నేతల విమర్శలపై స్పందిస్తూ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రేవంత్ రెడ్డికి తీవ్ర అభిమాని అని, ఆ అభిమానంతోనే కొన్ని వ్యాఖ్యలు చేసి ఉండవచ్చని వ్యాఖ్యానించారు. అదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు ప్రవర్తించిన తీరు దళిత సమాజాన్ని తీవ్రంగా అవమానించే విధంగా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు

రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- దేశంలో 7 కారిడార్లలో మల్టీ ట్రాకింగ్ పనులకు కేబినెట్ ఆమోదం
- రూ.10,783 కోట్ల వ్యయంతో ప్రాజెక్టులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం
- 5 రాష్ట్రాలు, 14 జిల్లాల మీదుగా సాగనున్న మల్టీ ట్రాకింగ్ లైన్లు
- అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 3, 4 లైన్ల నిర్మాణానికి ఆమోదముద్ర
- ఘట్‌కేసర్-కాజీపేట మధ్య రద్దీ తగ్గించేందుకు 4వ లేన్ నిర్మాణం
- సుమారు 300 కిలోమీటర్ల మేర కొత్తగా పెరగనున్న రైల్వే లైన్ సామర్థ్యం
- సరుకు రవాణా వేగవంతంతో పాటు ప్రయాణికుల నిరీక్షణ సమయం తగ్గుదల
- నిర్మాణం ద్వారా భారీగా పరోక్ష, ప్రత్యక్ష ఉపాధి అవకాశాల లభ్యత

న్యూఢిల్లీ, (డీడీ9 వార్త):

దేశవ్యాప్తంగా రైల్వే నెట్‌వర్క్‌ను ఆధునీకరించడంతో పాటు ప్రధాన మార్గాల్లో రద్దీని తగ్గించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్, ఏడు అత్యంత ప్రాధాన్యత కలిగిన కారిడార్లలో నాలుగు లేన్ల నిర్మాణానికి ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు మొత్తం రూ.10,783 కోట్ల అంచనా వ్యయంతో మూడు భారీ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఈ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులు దేశంలోని 5 రాష్ట్రాల పరిధిలోని 14 జిల్లాలను కవర్ చేస్తూ రూపుదిద్దుకోనున్నాయి.

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఈ కేబినెట్ నిర్ణయంతో రైల్వే మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతాన్ని తమిళనాడుతో అనుసంధానించే అరక్కోణంరేణిగుంట సెక్షన్ మధ్య 3వ, 4వ లేన్ల నిర్మాణానికి కేబినెట్ అనుమతి ఇచ్చింది. అదేవిధంగా తెలంగాణలోని ప్రధాన రైల్వే మార్గమైన ఘట్‌కేసర్‌కాజీపేట సెక్షన్ మధ్య విపరీతమైన రైళ్ల రద్దీని నివారించడానికి నాలుగో లేన్ (4th Line) నిర్మించనున్నారు. ఈ ట్రాకింగ్ పనుల ద్వారా సరుకు రవాణా రైళ్లతో పాటు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిర్వహణ అత్యంత వేగవంతం కానుంది. ఈ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుల వల్ల రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యం పెరగడమే కాకుండా, బొగ్గు, సిమెంట్, ధాన్యం వంటి అత్యవసర సరుకుల రవాణా వేగవంతమవుతుంది. అలాగే లాజిస్టిక్ వ్యయం తగ్గి, వస్తువుల సరఫరా మరింత సరళంగా మారుతుంది. ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో వేలాది మందికి పరోక్ష, ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. పర్యావరణ పరిరక్షణ దృష్టి దృష్ట్యా కూడా ఇంధన వినియోగం తగ్గి, కార్బన్ ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయని కేంద్రం తెలిపింది.

వందేమాతరంపై వార్

- పూర్తి గేయంపై కాంగ్రెస్ అభ్యంతరం
- తొలి రెండు చరణాలకే మద్దతు
- శ్రీనగర్‌లో ఒమర్, ఫరూక్ అబ్దుల్లా
- కాంగ్రెస్ తీరుపై ఎన్‌సీ అసహనం
- మిత్రపక్షాలపై షరతులేంటన్న ప్రశ్న
- కూటమి నిర్ణయాలు గౌరవించాలన్న కాంగ్రెస్
- ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం
- కాంగ్రెస్‌పై భాజపా తీవ్ర విమర్శలు
- మరో ముస్లిం లీగ్‌గా మారిందంటూ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, (డీడీ9 వార్త):

జాతీయ గేయం 'వందేమాతరం'ను పూర్తిగా ఆలపించే అంశం ఇండియా కూటమిలో మరోసారి విభేదాలకు దారితీసింది. కాంగ్రెస్, జమ్మూ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. పూర్తి వందేమాతరం ఆలపించడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం రాజుకుంది. శ్రీనగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పూర్తి వందేమాతరం ఆలపించే వరకు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సహా పలువురు నిల్చొని ఉన్నారు. దీనికి సంబంధించిన వీడియోను కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

పూర్తి వందేమాతరం ఆలపించడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇప్పటివరకు పాడుతున్న విధంగానే గేయంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న తమ డిమాండ్‌కు నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు మద్దతు ఇవ్వాలని కోరింది.

కాంగ్రెస్ అభ్యంతరంపై నేషనల్ కాన్ఫరెన్స్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న తమపై కాంగ్రెస్ షరతులు విధించే అధికారం లేదని స్పష్టం చేసింది. తమ భావజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపింది. ఇదే సమయంలో కాంగ్రెస్‌నేత కపిల్ సింగ్ స్పందించారు. ఒమర్ అబ్దుల్లా, ఫరూక్ అబ్దుల్లా ఇండియా కూటమిలో భాగస్వాములని గుర్తుచేశారు. కూటమి భాగస్వాములుగా కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలను వారు గౌరవించాలని అన్నారు. దీంతో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ నేతల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. వందేమాతరం ఆలాపన అంశం కూటమి పార్టీల మధ్య విభేదాలను బయటపెట్టింది.

భాజపా విమర్శలు

వందేమాతరాన్ని పూర్తిగా ఆలపించడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించడంపై భాజపా విమర్శలు చేసింది. కాంగ్రెస్ కొత్త ముస్లిం లీగ్‌గా మారిందనడానికి ఆ పార్టీ వైఖరే నిదర్శనమని పేర్కొంది. వందేమాతరం విషయంలో కాంగ్రెస్ ఏకాకిగా నిలిచిపోయిందని భాజపా విమర్శించింది. జాతీయ గేయానికి సంబంధించిన అంశంపై కాంగ్రెస్ వైఖరిని ఆ పార్టీ తప్పుబట్టింది. ఇలా వందేమాతరం ఆలాపన అంశం కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ మధ్య రాజకీయ విభేదాలకు కొత్త కారణంగా మారింది. ఇప్పటికే పలు అంశాల్లో భిన్న వైఖరులు వ్యక్తం చేస్తున్న కూటమి పార్టీల మధ్య ఈ వివాదం మరింత చర్చకు దారితీసింది.

తెలంగాణలో బీజేపీదే అధికారం

- ఉత్తర్‌ప్రదేశ్ తర్వాత తెలంగాణపై బీజేపీ ఫోకస్
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడండి
- బీజేపీ శ్రేణులకు బండి సంజయ్ కీలక పిలుపు
- పోలీసు కేసులకు భయపడొద్దని స్పష్టీకరణ
- 109 కేసులున్నా వెనక్కి తగ్గనన్న బండి
- గడప గడపకు వెళ్లాలని కార్యకర్తలకు సూచన



హైదరాబాద్, (డీడీ9 వార్త):

తెలంగాణలో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. భద్రాచలంలో బీజేపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల తర్వాత బీజేపీ అధిష్ఠానం టార్గెట్ తెలంగాణేనని బండి సంజయ్ తెలిపారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ప్రజల్లోకి వెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ పాలనలో బీజేపీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని బండి సంజయ్ అన్నారు. రజాకార్ల పాలన కంటే ఘోరమైన కేసీఆర్ పాలనలో బీజేపీ కార్యకర్తలు పోరాడారని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి బీజేపీ కార్యకర్తపై అక్రమ కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రి ఢిల్లీకి మూటలు పంపుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీశాయి. అయితే ఆ మంత్రి పేరు, ఆరోపణలకు సంబంధించిన మరిన్ని వివరాలను ఆయన వెల్లడించలేదు.

కాంగ్రెస్ ప్రభుత్వంపైనా బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అందిస్తున్న ఇళ్లు, సన్న బియ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటోందని విమర్శించారు. కేంద్రం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు వివరించాలని బీజేపీ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని సూచించారు. పోలీసు కేసులకు కార్యకర్తలు భయపడొద్దని బండి సంజయ్ అన్నారు. తనపై 109 కేసులు ఉన్నా వెనుకడుగు వేయడం లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఇక యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు.

గడప గడపకు బీజేపీ కార్యకర్తలు వెళ్లాలని బండి సంజయ్ సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ విధానాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. ఈ పరిస్థితిని బీజేపీకి అనుకూలంగా మార్చుకోవాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని బండి సంజయ్ మరోసారి స్పష్టం చేశారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. భద్రాచలం సమావేశంలో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ దూకుడును సూచిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత పెంచాలని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గత బీఆర్ఎస్ పాలనను కూడా టార్గెట్ చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

- కాళోజీ స్ఫూర్తితో మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలి

డిడి9 వార్త గుడిహత్నూర్:



తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ మోడల్ కళాశాల, పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రజల యాస, భాష, సంస్కృతికి విశిష్ట గుర్తింపు తీసుకొచ్చిన ప్రముఖ కవి, రచయిత కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వివిధ సాంస్కృతిక, సాహిత్య పోటీలను నిర్వహించారు. క్విజ్ పోటీలు, వ్యాసరచన, డ్రాయింగ్, చిత్రలేఖనం, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, చరిత్ర, కాళోజీ సాహిత్యంపై విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.

పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేసి అభినందించారు. పోటీల్లో పాల్గొన్న మిగతా విద్యార్థులను కూడా ప్రోత్సహిస్తూ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరె శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ భాషకు ప్రత్యేకమైన మాధుర్యం, జీవన విధానంతో ముడిపడిన గొప్ప సాంస్కృతిక వారసత్వం ఉందన్నారు. కాళోజీ నారాయణరావు తన రచనలు, ఉద్యమాల ద్వారా తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ మాతృభాషను గౌరవిస్తూ తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను, భాషపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. పుస్తక పఠనం, సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో , వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఇందిరా మేడం, సుప్రజ మేడం, సంపత్ సార్తో పాటు కళాశాల, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి.

ఎస్సీలను బీఆర్ఎస్ అవమానిస్తోంది

మొదటిపేజీ తరువాయి

ప్రారంభమైన వెంటనే ఎర్రవల్లిలో జరిగిన శుద్ధి కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా సభలో మాట్లాడిన మంత్రి లక్ష్మణ్, ఎర్రవల్లిలో ఎస్సీ సామాజిక వర్గం నేతలు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం వెనుక ఉన్న అంతర్యాన్ని ప్రశ్నించారు. శుద్ధి పేరుతో ఎస్సీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీఆర్ఎస్ నేతలు ప్రవర్తించారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రాంతాన్ని ఆత్మగౌరవం కోసమే పోరాడి సాధించుకున్నామని, అయితే రాష్ట్రం సిద్ధించిన తర్వాత కూడా ఎస్సీలపై వివక్ష కొనసాగడం విచారకరమని మంత్రి అడ్లూరి అన్నారు. ఎర్రవల్లిలో శుద్ధి పేరుతో బీఆర్ఎస్ నేతలు చేసిన హేయమైన చర్యకు ఏం సమాధానం చెబుతారని ఆయన సభ ముఖంగా నిలదీశారు. ఈ వివక్షపూరిత చర్యపై బీఆర్ఎస్ నేతలు వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో స్పీకర్ విషయంలో జరిగిన ఘటనపై కూడా బీఆర్ఎస్ నాయకుల్లో ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆయన విమర్శించారు.



మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్ఎస్ శాసనసభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన మాటలకు అడుగడుగునా అడ్డు తగులుతూ సభలో నిరసనకు దిగారు. 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ అసెంబ్లీని హోరెత్తించారు. బీఆర్ఎస్ సభ్యుల గోల మధ్యనే మంత్రి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ బీఆర్ఎస్ తీరును తప్పుపట్టారు.

బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్

సస్పెండ్ చేశారు.

సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. సభా కార్యకలాపాలకు అడ్డుతగిలారు. దీంతో వారిని సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. అనంతరం స్పీకర్ సస్పెన్షన్ నిర్ణయాన్ని ప్రకటించారు.

సస్పెన్షన్ అనంతరం బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లారు. అయితే వారిని మార్షల్స్ అడ్డుకున్నారు. దీంతో అసెంబ్లీ ప్రాంగణంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మరోవైపు బీఆర్ఎస్ తీరుపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. సభాపతిని అవమానించేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సభ సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు.



బీఆర్ఎస్ నేతల తీరును ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని భట్టి అన్నారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ సిద్ధంగా లేదని స్పష్టం చేశారు. బలహీనవర్గాలు, దళితులు, గిరిజనులకు న్యాయం జరగాల్సి ఉందని పేర్కొన్నారు.

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కు ఆదిలాబాద్ జిల్లా యువత సిద్ధం కావాలి

ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (డిడి9 వార్త న్యూస్)

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ప్రతి సంవత్సరం జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ యువజన దినోత్సవం ను మరింత విస్తృతమైన సామాజిక, సాంస్కృతిక మరియు యువజన భాగస్వామ్య వేదికగా మార్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్ @2047' దార్శనికతకు అనుగుణంగా, 2025లో జాతీయ యువజన ఉత్సవాన్ని 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ గా పునర్వ్యవస్థీకరించారు.

ఈ కార్యక్రమంలో 15 నుండి 29 సంవత్సరాల వయస్సు గల యువత భాగస్వామ్యం అయ్యేలా కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ విస్తృత కార్యక్రమాలను చేపడుతోంది. తదితర కార్యక్రమాల ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, దేశ నిర్మాణంపై అవగాహన మరియు బాధ్యతాయుత పౌరసత్వాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యం.2027 జనవరిలో నిర్వహించనున్న కార్యక్రమానికి గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేయాలని మేరా యువ భారత్ సూచిస్తోంది. ఇందుకోసం యువత mybharat.gov.in పోర్టల్ https://mybharat.gov.in/quizzes/yuva/detail/uHzkZ9NIN0AdIPVjogfWMg/?referral_code=6N5EE9QQ ద్వారా నమోదు చేసుకుని కార్యక్రమంలో పాల్గొనవచ్చు లేదా కింద చూపిన QR కోడ్ని స్కాన్ చేయండి. "వికసిత్ భారత్ నిర్మాణంలో యువత స్వరం Your Voice Can Shape a Viksit Bharat" అనే స్ఫూర్తితో యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలు, నూతన ఆవిష్కరణలు మరియు దేశ అభివృద్ధికి సంబంధించిన సూచనలను అందించేందుకు ఈ కార్యక్రమం ఒక గొప్ప వేదికగా నిలుస్తుంది.

ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే Viksit Bharat Quiz ద్వారా యువతకు తమ జ్ఞానాన్ని పరీక్షించుకునే అవకాశం లభించడంతో పాటు, భారతదేశ అభివృద్ధి, సంస్కృతి, చరిత్ర, భవిష్యత్ భారతదేశ నిర్మాణం వంటి అంశాలపై మరింత అవగాహన కలుగుతుంది.

ఆదిలాబాద్ జిల్లాలోని యువత ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ ప్రతిభను, సృజనాత్మక ఆలోచనలను మరియు నాయకత్వ సామర్థ్యాలను దేశ నిర్మాణానికి వినియోగించుకోవాలని మై భరత్ ఆదిలాబాద్ పిలుపునిస్తోంది.

యువత కేవలం దేశ భవిష్యత్తు మాత్రమే కాదు దేశ వర్తమానాన్ని కూడా మార్చగల శక్తి. ప్రతి యువతి యువకులు భాగస్వామ్యం కావడం ద్వారా వికసిత్ భారత్ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని కోరుతున్నాము. విజయవంతం చేసేందుకు యువతకు అవసరమైన అన్ని రకాల అవగాహన మరియు సహాయ కార్యక్రమాలను నిర్వహించనున్నాము. మరిన్ని వివరాల కోసం మొబైల్ నంబర్ 9618174338 ని సంప్రదించండి

ప్రజాకవి కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

• **ఆర్డీవో విజయకుమారి**

బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 08(డీడీ9 వార్త):

తెలంగాణ భాష, సంస్కృతుల రక్షణకు, ప్రజా చైతన్యానికి కాళోజీ నారాయణరావు తన రచనలతో చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బోధన్ ఆర్డీవో ఎం.విజయకుమారి పిలుపునిచ్చారు. బోధన్ ఆర్డీవో కార్యాలయంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి ఆర్డీవో పూలమాల వేసి అంజలి ఘటించారు. తెలంగాణ ఉద్యమానికి కాళోజీ కవిత్వమే బాటలు వేసిందని, ఆయన కవితా ప్రయాణం భావి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఐదేళ్ల నిరీక్షణకు తెర

డిడి9 వార్త గుడిహత్నూర్ :

మండలంలోని డామన్‌గూడకు చెందిన కొడప దుర్పత బాయికి ఐదేళ్ల నిరీక్షణకు తెరపడింది. భర్త మారుతి పేరిట ఉన్న పిఒఎఫ్‌అర్ అటవీ హక్కు పత్రాన్ని తన పేరుపైకి మార్చుకునేందుకు ఆమె పలుమార్లు అధికారులను సంప్రదించినా పరిష్కారం లభించలేదు. ఈ విషయాన్ని సామాజిక కార్యకర్త, కాంగ్రెస్ యువ నాయకుడు ఆడే జైపాల్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన అధికారులతో మాట్లాడి ప్రక్రియను పూర్తి చేయించడంతో అటవీ హక్కు పత్రం దుర్పత బాయికి అందింది. ఈ సందర్భం



గా ఆమె జైపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



పారదర్శకంగా 'సర్' నోటీసుల విచారణ పూర్తి చేయాలి

బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్09(డిడి9 వార్త):


సాలూర మండల పరిధిలోని ఫత్తేపూర్ గ్రామంలో కొనసాగుతున్న 'సర్' నోటీసుల విచారణ ప్రక్రియను తహసీల్దార్ అజ్మత్ నవాజ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని విచారణ కేంద్రంను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. నోటీసుల విచారణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిబంధనలకు లోబడి నిర్వహించాలని ఆదేశించారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. విచారణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నూర్ అహ్మద్, ఉప సర్పంచ్ మోసిన్, బి.ఎల్.ఓ., రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల అమావాస్య పూజలకు మారుతి మందిరం సిద్ధం

• **నేడే వైభవంగా వృషభ కళ్యాణం**

బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్09(డిడి9 వార్త):

శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని బోధన్ పట్టణంలోని శ్రీ మారుతి మందిరంలో గురువారం ఎడ్ల పొలాల అమావాస్య వేడుకలు, వృషభ కళ్యాణాన్ని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నాయకం రాములు తెలిపారు. వ్యవసాయదారులు నందీశ్వరుడిగా భావించే ఎడ్లను పూజించడం అనాదిగా వస్తున్న ఆచారమని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా అజయ్ వడియార్ వంశస్తుల గృహం నుంచి ఎడ్లను ఆలయానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా వృషభ కళ్యాణం జరిపిస్తామని చెప్పారు. ఆలయ అర్చకులు ప్రవీణ్ మహారాజ్ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు పూర్తయ్యాక భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు. ఈ ఉత్సవానికి రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖల అధికారులు సహకరించాలని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.



ధైర్యానికి, ఆత్మగౌరవానికి నిదర్శనం కాళోజీ

• **ధైర్యానికి, ఆత్మగౌరవానికి నిదర్శనం కాళోజీ**

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డిడీ9 వార్త):



తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక కాళోజీ నారాయణరావు అని బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. నాటి పాలకుల అన్యాయాలపై కవిత విల్లు ఎక్కుపెట్టిన ప్రజాకవి కాళోజీ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఫ్లోర్ లీడర్ శరత్ రెడ్డి, కౌన్సిలర్ ఆదినారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కొండిశీకుల భూమి దురాక్రమణ...!

- చెరబట్టిన భూమి విలువ రూ.15 కోట్ల పైమాటే...!
- అంతా మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యుల కనుసన్నల్లోనే...!
- రోడ్డు వైడెనింగ్‌లో రూ.38 కోట్లకు పైగా నష్టపరిహారం పొందిన వైనం...!
- ఈ భూమి మాదేనంటూ ప్రగల్భాలు పలుకుతున్న ఆక్రమణదారులు...!
- ఏ. డీ. సర్వే చేసి వాస్తవాలు నిగ్గు తేల్చాలంటున్న స్థానికులు...!
- జిల్లా కలెక్టర్ స్పందిస్తేనే వాస్తవాలు బట్టబయలు...!

పరిహారం పొందిందే కాక.. 1500 చదరపు గజాల కైంకర్యం !

ఇటీవల చేపట్టిన హైదరాబాద్ నుండి కరీంనగర్ హైవే రోడ్డు విస్తరణ (రోడ్డు వైడెనింగ్) పనుల్లో మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూమికి ఏకంగా రూ.38 కోట్లకు పైగా నష్టపరిహారాన్ని పొందారని, అంతటితో ఆగకుండా, పరాయి దేశానికి చెందిన తమకు ఎలాంటి సంబంధం లేని ఇవాక్యూయీ ప్రాపర్టీని దురాక్రమణ చేసి, రూ.15 కోట్లకు పైగా విలువ చేసే 1500 చదరపు గజాల భూమిలో యథేచ్ఛగా 8 అక్రమ షెడ్ల నిర్మాణాన్ని కొనసాగిస్తుండటం గమనార్హమని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలైన బాధితులు, శరణార్థుల చట్టబద్ధ వారసుల (విషన్ దాస్ లఖ్వానీ తదితరులు) హక్కులను కాలరాసి, ఒకవైపు కోట్లాది రూపాయల పరిహారం దండుకుని, మరోవైపు కాందీశీకుల భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతుండటంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. పైగా "ఈ భూమి మాదే, మమ్మల్ని ఎవరేం చేయలేరు" అంటూ ఆక్రమణదారులు బహిరంగంగా సవాల్ విసరడం స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

డి డి 9 వార్త. బ్యూరో చీఫ్ :

దేశ విభజన కాలం నాటి కాందిశీకుల (ఇవాక్యూ) భూములపై భూబకాసురుల కన్ను పడింది. తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, తూంకుంట గ్రామంలోని అత్యంత ఖరీదైన ఇవాక్యూ ప్రాపర్టీని యథేచ్ఛగా ఆక్రమించడమే కాకుండా, అందులో సుమారు 1500 చదరపు గజాల విస్తీర్ణంలో దర్జాగా 8 అక్రమ షెడ్లను నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఆక్రమిత భూమి బహిరంగ మార్కెట్ విలువ రూ.15 కోట్లకు పైమాటే ఉంటుందని వారు పేర్కొంటున్నారు! అధికార యంత్రాంగం నిద్రమత్తులో ఉండటంతో ఆక్రమణదారులు కోట్లు కొల్లగొడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

వివరాలలోకి వెళితే..

నాటి కేటాయింపు.. నేటి వివాదం.

ఈ భూముల చరిత్రను పరిశీలిస్తే ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తొలుత ఈ భూములు పాకిస్థాన్‌కు వలస వెళ్లిన నజీర్ అహ్మద్ ఖాన్‌కు చెందినవిగా రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అనంతరం తూంకుంట రామయ్య అనే వ్యక్తి ఈ భూములను కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చినప్పటికీ, కొనుగోలు షరతుల్లో భాగంగా చెల్లించాల్సిన రూ.2,300 బకాయిని చెల్లించకపోవడంతో ఆయనకు కల్పించిన హక్కులను ప్రభుత్వం రద్దు చేసినట్లు రికార్డుల్లో స్పష్టమవుతుంది. దీంతో ఈ భూములు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఇవాక్యూ ఫూల్ ఆస్తులుగా నమోదయ్యాయి. అనంతరం దేశ విభజన సమయంలో పాకిస్థాన్ నుంచి భారత్‌కు వచ్చిన శరణార్థి ఫాతుమల్ కన్వర్‌మల్‌కు కేంద్ర ప్రభుత్వం ఈ భూములను అధికారికంగా కేటాయించినట్లు సంబంధిత రెవెన్యూ రికార్డులు వెల్లడిస్తున్నాయి.

భారత రాష్ట్రపతి తరపున 1968 జూన్ 22న జారీ చేసిన 'సనద్' (హక్కు పత్రం) ప్రకారం ఫాతుమల్ కన్వర్‌మల్‌కు మొత్తం 24 ఎకరాల 18 గుంటల భూమిని ప్రభుత్వం చట్టబద్ధంగా కేటాయించింది. అనంతరం సంబంధిత అధికారులు పంచనామా నిర్వహించి భూమిని అప్పగించినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఈ కేటాయింపులో సర్వే నెంబర్ 81లో 3 ఎకరాల 14 గుంటలు, 82లో 3 ఎకరాల 28 గుంటలు, 83లో 3 ఎకరాల 38 గుంటలు, 84లో 3 ఎకరాల 19 గుంటలు, 85లో 2 ఎకరాల 26 గుంటలు, 86లో 3 ఎకరాల 21 గుంటలు, 87లో 3 ఎకరాల 32 గుంటల భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం 1968లో శరణార్థికి చట్టబద్ధంగా కేటాయించి, పంచనామా ద్వారా అప్పగించిన ఈ భూములపై ప్రస్తుతం వివాదం నెలకొనడం చర్చనీయాంశంగా మారింది.



కథ కిచెన్ ఎదురుగా అక్రమ షెడ్డు



మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్

మాజీ సర్పంచ్ ఎద్దు నగేష్ కుటుంబ సభ్యుల కనుసన్నల్లోనే !

ఈ భూములపై తూంకుంట రామయ్య దాఖలు చేసిన దావాను (ఓ .ఎస్. నెం. 100/1968) మున్సిఫ్ కోర్టు, ఆ తర్వాత వేసిన అప్పీల్‌ను (ఏ .ఎస్ . నెం. 114/1973) సిటీ సివిల్ కోర్టు స్పష్టంగా కొట్టివేశాయని కోర్ట్ ఆర్డర్స్ చూస్తే తేటతెల్లమవుతుంది. కోర్టు తీర్పుల ప్రకారం ఈ భూమిపై రామయ్యకు ఎలాంటి హక్కులూ లేవని స్పష్టమవుతుంది. అయినప్పటికీ, కోర్టు ఉత్తర్వులను తుంగలో తొక్కి, సదరు తూంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ కటుంబ సభ్యుల అండదండలతోనే కోట్ల విలువైన ఇవాక్యూ సర్వే నంబర్ల భూములను చెరబట్టారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఏ.డీ. సర్వే చేసి వాస్తవాలు నిగ్గు తేల్చాలంటున్న స్థానికులు..!

చట్టబద్ధంగా శరణార్థులకు కేటాయించిన ఈ 'ఇవాక్యు (ప్రాపర్టీ' సర్వే నంబర్లలో ఏ.డీ. (అసిస్టెంట్ డైరెక్టర్) ఆధ్వర్యంలో సమగ్ర సర్వే నిర్వహిస్తే భూముల ప్రస్తుత స్థితి, హక్కులు, ఆక్రమణలపై వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు. భూ రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి భూమి హద్దులను నిర్ధారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా కలెక్టర్ స్పందిస్తేనే వాస్తవాలు బట్టబయలు..!

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ప్రత్యేక విచారణకు ఆదేశించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఆక్రమణలకు పాల్పడినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమంగా నిర్మించిన షెడ్లను తొలగించి కాందిశీకుల భూమిని పరిరక్షించాలని వారు కోరుతున్నారు. రోడ్డు వైడెనింగ్‌కు సంబంధించి పొందిన నష్టపరిహారం, 1,500 చదరపు గజాల్లో కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అక్రమ షెడ్ల నిర్మాణంపై కూడా పూర్తి స్థాయి విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇవాక్యు ప్రాపర్టీగా రికార్డుల్లో ఉన్న భూమిని ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సమగ్ర సర్వే, రికార్డుల పరిశీలన, చట్టపరమైన చర్యల ద్వారానే ఈ భూములపై నెలకొన్న వివాదానికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గణపతి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

• **మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి: ఎస్పీ అఖిల్ మహాజన్**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 9: (డిడి 9 వార్త న్యూస్)

గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. బోథ్ మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో బోథ్, బజార్హత్నూర్, నేరడిగొండ, సోనాల మండలాల గణపతి మండపాల నిర్వాహకులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి గణపతి మండపాన్ని పోలీస్ శాఖ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటలు కనీసం ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

మండపాల నిర్మాణంలో నాణ్యమైన, మన్నికైన సామగ్రిని వినియోగించాలని, విద్యుత్ కనెక్షన్లు, లైట్ల ఏర్పాటులో నాణ్యమైన వైర్లు, పరికరాలను ఉపయోగించాలని సూచించారు.

వర్షం, గాలులు, అధిక జనసందోహం వల్ల మండపాలకు ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్ని ప్రమాదాల నివారణకు నీరు, ఇసుక అందుబాటులో ఉంచాలని తెలిపారు. రహదారులకు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు.

రాత్రి 10 గంటల తర్వాత మైక్, సౌండ్ సిస్టమ్ వినియోగించరాదని, అధిక శబ్దంతో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. మండపాల వద్ద టపాసులు కాల్చడం, జూదం, లక్కీ డ్రాలు నిర్వహించడం, మద్యం సేవించడం, బలవంతంగా చందాలు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడరాదన్నారు. రెచ్చగొట్టే పాటలు వినిపించరాదని సూచించారు.

నిమజ్జనం రోజున పోలీసుల సూచనలు పాటిస్తూ ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100/112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సమావేశంలో డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, సీఐలు డి. గురుస్వామి, సీహెచ్. రమేష్, ఎస్సైలు వి. పురుషోత్తం, రమేష్, పోలీసు సిబ్బంది, నాలుగు మండలాలకు చెందిన సుమారు 250 మంది గణపతి మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

• **జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 09: (డిడి9 వార్త న్యూస్)

కౌ (బి) ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు శ్రీ శశిధర్ రెడ్డి మరియు శ్రీరామ్ లను స్థానిక స్వామి వివేకానంద యూత్ సభ్యులు బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేస్తూ, విద్యారంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించడం పట్ల యూత్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డులు కౌ(బి) పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని పేర్కొంటూ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజయ్య , వి డి సి చైర్మన్ అశోక్ రెడ్డి, రమణ గౌడ్ , రాజు రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, స్వామి వివేకానంద యూత్ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.








పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలి

- **ఉచిత పోలీస్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి**
- **అభ్యర్థులకు పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, సీపీ సాయి చైతన్య**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ ఉద్యోగ ప్రకటనలను సద్వినియోగం చేసుకుంటూ నిరుద్యోగ యువత పట్టుదల, ఏకాగ్రతతో చదివి ఉద్యోగాలు సాధించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా యంత్రాంగం తోడ్పాటుతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 200 మంది ఎస్.ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత భోజన వసతితో ఇస్తున్న రెండు నెలల ప్రీక్రూట్‌మెంట్ శిక్షణ శిబిరాన్ని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా అభ్యర్థులతో మాట్లాడుతూ.. రీజనింగ్ ఎబిలిటీ, ఆంగ్లం, గణితం అంశాలలో ఎక్కువ మార్కులు సాధించడానికి పాటించాల్సిన మెళకువలను వివరించారు. స్వయంగా నైపుణ్య సామర్థ్య పరీక్షలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పోటీ తీవ్రంగా ఉన్న దృష్ట్యా రెండు నెలల పాటు సెల్ ఫోన్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని భాగ్యకిరణ్ ఇన్స్టిట్యూట్ నిపుణులచే ఇక్కడ నాణ్యమైన శిక్షణ, మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. యువతను సరైన మార్గంలో నడిపించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, భాగ్యకిరణ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ భాగ్యకిరణ్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ టేబుల్స్ పంపిణి

అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డి డి 9 వార్త)

సెప్టెంబర్ 9 తలమడుగు మండలం. పల్సి k. ప్రాథమిక పాఠశాలలో. రిటైర్డ్ వ్యవసాయ అధికారి. రచయిత. బోరే మురళి 30. మంది విద్యార్థులకు సుమారు పదివేల రూపాయల విలువగల హ్యాండ్ రైటింగ్ టేబుల్స్ తోపాటు నోట్ బుక్కులు పంపిణీ చేశారు.

రిటైర్డ్ అధికారి మురళి మాట్లాడుతూ. విద్యార్థుల చదువుకు ఉపయోగపడేలా ఈ సామాగ్రిని అందించడం వల్ల చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి. ముఖ్యఅతిథిగా. గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య హాజరై మాట్లాడుతూ. విద్య లేకుండా భవిష్యత్తులో ముందుకు సాగడం కష్టమని ప్రతి విద్యార్థి కష్టపడి చదివి. ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు విద్యను ఆయుధంగా చేసుకొని జీవితంలో పై స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి. మాజీ ఎంపీపీ కళ్యాణం రాజేశ్వర్.సర్పంచ్ నైతం చిన్ను. రిటైర్డ్ టీచర్ రాజ వర్ధన్. మాజీ ఎంపీటీసీ వెంకన్న. రుయ్యాడి సర్పంచ్ ఉడుగు రాకేష్ సల్ల దేవన్న. పాఠశాల ఉపాధ్యాయులు సురేందర్ యాదవ్. గ్రామ పంచాయతీ సెక్రెటరీ జైపాల్. గ్రామస్తులు మరియు యువకులు పాల్గొన్నారు

కుటుంబ వ్యవస్థను పరిరక్షించుకోవాలి

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

ఆధునిక జీవన విధానం, కెరీర్ అభివృద్ధి పేరుతో హిందువులు కుటుంబ వ్యవస్థను నిర్లక్ష్యం చేయవద్దని, కుటుంబ విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని విశ్వ హిందూ పరిషత్ ఆర్మూర్ నగర సహ కార్యవాహ, బౌద్ధిక్ ప్రముఖ్ దయాసాగర్ పిలుపునిచ్చారు. విశ్వ హిందూ పరిషత్ ఇందూర్ జిల్లా ఆర్మూర్ నగరం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విహెచ్‌పి 'స్థాపన దివస్' కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా యువకులతో ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో దయాసాగర్ మాట్లాడుతూ.. హిందువుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతూ, ఇతర మతస్తుల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన సమయానికి పెళ్లిళ్లు చేసుకుని కుటుంబ జీవనం సాగించాలని, కెరీర్ కోసమని కుటుంబాన్ని వాయిదా వేస్తూ పోతే భవిష్యత్తు తరాలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. మతమార్పిడుల నిరోధం, మహిళలుయువత భద్రత, జనాభా సమతుల్యతపై విహెచ్‌పి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి జిల్లా కార్యదర్శి గాజుల దయాకర్, ఆర్మూర్ ప్రభారీ అల్జాపూర్ అక్షయ్, నగర కార్యదర్శి కొంగి, ఉపాధ్యక్షులు గంజాల ప్రేమ్, భజరంగ్‌దళ్ సంయోజక్ కత్తి శ్రీనివాస్, ప్రచార ప్రముఖ్ అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.





హెచ్‌సీలుగా ప్రమోషన్ పొందిన కానిస్టేబుళ్లకు సీపీ అభినందనలు

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన ఇద్దరు కానిస్టేబుళ్లను జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు పదోన్నతులు పొందిన నిజామాబాద్ టౌన్2 పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎ.గణేష్, టౌన్3 పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కె.వినోద్ కుమార్ లు సీపీని కలవగా.. ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గత కొంతకాలంగా ఎదురు చూస్తున్న ప్రమోషన్లు రావడంతో సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.





ఆర్మూర్ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలి

- **సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి వినతి**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):



ఆర్మూర్ పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు కేటాయించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. బుధవారం తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమంత్రిని కలిసిన ఆయన నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్మూర్ మున్సిపాలిటీకి నూతన భవన నిర్మాణం కోసం రూ.7.50 కోట్లు మంజూరు చేయడంతో పాటు అవసరమైన అనుమతులను త్వరితగతిన ఇవ్వాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఖరీఫ్ పంటల సాగును దృష్టిలో ఉంచుకుని గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తక్షణమే విడుదల చేయాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుత్ప నీటి విడుదలపై అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారని, నిధుల మంజూరుపై సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తెలిపారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్సై సతీష్

- **- కమ్మర్‌పల్లిలో డీజే నిర్వాహకులకు కౌన్సెలింగ్**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

గణేశ్ నవరాత్రి ఉత్సవాల వేళ శాంతిభద్రత పరిరక్షణే ధ్యేయంగా కమ్మర్‌పల్లి పోలీసులు చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని డీజే, సౌండ్ సిస్టమ్ ఆపరేటర్లకు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సిహెచ్. సతీష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ నిమిత్తం ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఉత్సవాల్లో డీజేలు, భారీ సౌండ్ సిస్టమ్‌లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం పరిమితికి మించిన శబ్దాలు చేసే పరికరాలపై నిషేధం ఉందని గుర్తుచేశారు. మండపాల్లో లేదా నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు వాడితే ఆపరేటర్లతో పాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేసి సామగ్రిని జప్తు చేస్తామన్నారు. ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.



పంట సాగును పరిశీలించిన వ్యవసాయ అధికారి

- **డిజిటల్ క్రాప్ సర్వేకు రైతులు సహకరించాలి ఏఈఓ క్రిష్ణపాల్ సింగ్**

ఆదిలాబాద్ జిల్లా : బోథ్ మండలం : సెప్టెంబర్ 09: (డిడి9 వార్త న్యూస్)

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం మర్లపల్లి క్లస్టర్ బాబెర శివారంలోని వ్యవసాయ క్షేత్రంలో పరిశీలించారు. రైతులు వానాకాలం2026 సీజన్లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్)లో నమోదు చేసుకోవాలని మర్లపల్లె వ్యవసాయ విస్తరణ అధికారి క్రిష్ణపాల్ సింగ్ కోరారు. డీసీఎస్ వాలంటీర్లు క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేస్తారని పేర్కొన్నారు. వాలంటీర్లు నమోదు చేసిన పంట వివరాల ఆధారంగానే ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పంట కొనుగోలు చేపట్టే అవకాశం ఉంటుందని అన్నారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్లకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు



జీడిపల్లె లో గ్రామ సభ

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 09: (డిడి 9 వార్త న్యూస్)

ఈరోజు బోథ్ మండలం కరత్వాడ గ్రామపంచాయతీ లోని జీడిపల్లె గ్రామం లో నూతనంగా ఏర్పాటైనా పోలింగ్ బూత్ లో సర్పంచ్ దుర్వ విశ్వేశ్వర్ రావు అధ్యక్షతన ఎస్ ఐ ఆర్ గ్రామసభ నిర్వహించడం జరిగింది ఈసందర్భంగా తహసీల్దార్ ఎ సుభాష్ చందర్ మాట్లాడుతు ఓటర్ జాబితా లో తప్పులు ఉన్న వాటిని సరైన డాకుమెంట్స్ సమర్పించి ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా సరి చేసుకోవాలని 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్ జాబితా లో పేర్లు లేని వారు సరైన పత్రాలు బి ఎల్ ఓ కు ఇచ్చి ఓటర్ జాబితా లో నమోదు చేసుకోవాలని తెలియచేసారు ఆతరువాత జీడిపల్లె గ్రామం లో పోలింగ్ స్టేషన్ నూతనంగా ఏర్పాటుయన తరువాత మొదటిసారి తహసీల్దార్ వచ్చినందుకు గాను సర్పంచ్ మరియు గ్రామస్థులు తహసీల్దార్ కి శాలువాతో సత్కారించడం జరిగింది ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సమ్రిన్ సుల్తానా అంగన్వాడి టీచర్ శబన జి పి ఓ మందుల కృష్ణ బి ఎల్ ఓ లు మరియు గ్రామప్రజలు పాల్గొన్నారు



బోధన్‌లో హోటళ్లపై ఆహార భద్రత అధికారి దాడులు

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

బోధన్ పట్టణంలోని హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై ఆహార భద్రతా అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. టీజీ సేఫ్ తెలంగాణ కమిషనర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ ఆహార భద్రతా అధికారిణి జి.నవిత ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా, రాకాసిపేట ప్రాంతాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లు, టీ షాపులు, మండీలు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల్లో క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా 3.5 కిలోల పాడైన మయోనైస్, 10 కిలోల కుళ్లిన టమోటాలు, సింథటిక్ ఆహార రంగులు, రంగులు కలిపిన చికెన్, జిలేబీలను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు ఫస్సయి లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న ఐదు వ్యాపార సంస్థలకు షాపులు మూసివేయాలని నోటీసులు జారీ చేశారు. లైసెన్స్ పొంది పరిశుభ్రతా ప్రమాణాలు పాటించే వరకు వ్యాపారాలు పునఃప్రారంభించవద్దని ఆదేశించారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది, అధికారులు ఉన్నారు.





తెలంగాణ చైతన్య స్ఫూర్తి కాళోజీ : అదనపు కలెక్టర్ భుజంగరావు

- **కలెక్టరేట్‌లో ఘనంగా ప్రజాకవి జయంతి వేడుకలు**

నిజామాబాద్‌జిల్లా,సెప్టెంబర్ 09(డీడీ9వార్త):



తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక, ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో బుధవారం అధికారికంగా ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ భుజంగరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి భావపూర్వక నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్యం, ఆయన రచనలు ప్రజల్లో అపారమైన చైతన్యాన్ని, ఉద్యమ స్ఫూర్తిని నింపాయని కొనియాడారు. సమాజంలో జరిగే అన్యాయాలు, సామాజిక సమస్యలపై ఎలాంటి దాపరికం లేకుండా నిక్కచ్చిగా, నిర్మోహమాటంగా స్పందించిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే నాటి నిరంకుశ పాలనా విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించారని గుర్తుచేశారు. కాళోజీ చూపిన మార్గం, ఆయన ఆలోచనా విధానాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గీత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజశ్రీ, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై నిరంతర నిఘా

- **శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం సహించేది లేదు**
- **గంజాయి, సైబర్ నేరగాళ్లపై పీడీ యాక్ట్: సిపి పి. సాయి చైతన్య**
- **నిజామాబాద్ డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం పనిచేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశించారు. నగరంలోని కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నిజామాబాద్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో పెండింగ్ కేసుల పురోగతి, రాబోయే పండుగల బందోబస్తుపై ఆయన సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దాడులు నిర్వహించాలని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్‌పై స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించాలన్నారు. మహిళల భద్రతకు షీ టీమ్స్, ఈగల్ టీమ్స్ ద్వారా రక్షణ కల్పించాలన్నారు.



అత్యవసర సహాయం కోసం డయల్ 112పై విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్, సిసిఆర్బి ఏసీపీ గురునాయుడు, ఇన్‌స్పెక్టర్లు అంజయ్య, శ్రీధర్ రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

సర్కారీ బడి పిల్లలకు ఉచిత షూస్ పంపిణీ

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):


కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత షూస్‌ను గ్రామ సర్పంచ్ ఎనగందుల శైలేందర్ బుధవారం పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ ఏడాది తొలిసారిగా ప్రభుత్వ బడుల పిల్లలకు ఉచితంగా షూస్ అందజేయడం అభినందనీయమన్నారు. ఉచితంగా లభించిన షూస్ అందుకోవడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న సార్, ఉపాధ్యాయులు, ఉపసర్పంచ్ తక్కూరి ముత్యం, వార్డు మెంబర్ అజయ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ నరేష్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చేతివృత్తుల వారికి 'విశ్వకర్మ' వరప్రదాయిని: సర్పంచ్ సంధ్య

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కులవృత్తుల వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందని పోతంగల్ సర్పంచ్ కల్లూరి సంధ్య అన్నారు. మండల కేంద్రంలో పిఎం విశ్వకర్మ పథకం కింద మంజూరైన 16 మంది లబ్ధిదారులకు బుధవారం వాషింగ్ మిషన్ పరికరాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల శ్రమజీవుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఈ పథకం అమలవుతోందన్నారు. యంత్ర పరికరాలు పొందడం వల్ల లబ్ధిదారులకు పనిభారం తగ్గి రాబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టాఫీస్ సిబ్బంది, బీజేపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతాం: బిఆర్ఎస్

పోతంగల్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనబెట్టి ప్రతిపక్ష నాయకులపై బురదజల్లడమే పనిగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం పోతంగల్‌లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు తెల్ల రవికుమార్, సుధం నవీన్ మాట్లాడుతూ.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో మండలాల వారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టి కాంగ్రెస్ హామీల అమలును నిలదీస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ హయాంలోనే పోతంగల్ మండలం ఏర్పడి పరిపాలన ప్రజలకు చేరువైందన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే మంజీర నదిపై వంతెన నిర్మించి ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు విమర్శలు మాని ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మోరే కిషన్, ఆరిఫ్, ఎజాజ్, హన్మంతు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న 98 రామచిలుకల స్వాధీనం

- **పెట్ షాప్‌పై అటవీశాఖ అధికారుల దాడి**
- **ఇద్దరిపై కేసు నమోదు.. ఒకరికి 14 రోజుల రిమాండ్**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

నిజామాబాద్ నగరంలోని మలపల్లిలోని ఒక పెట్ షాప్‌లో అక్రమంగా విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 98 సజీవ రామచిలుకలను (రోజ్‌రింగ్డ్ పారకీట్స్) అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీ శాఖాధికారి ఆదేశాల మేరకు మల్లారం బీట్ పరిధిలోని మలపల్లి ప్రాంతంలో బుధవారం తనిఖీలు నిర్వహించగా ఈ వ్యవహారం వెలుగుచూసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 (షెడ్యూల్ III) కింద సంరక్షించబడిన రామచిలుకలను అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించి వాటిని రక్షణ కస్టడీలోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితులైన ఆర్సపల్లికి చెందిన సయ్యద్ కలీమ్, బర్మత్‌పురకు చెందిన సయ్యద్ బిన్ ఖాలిద్ లను అదుపులోకి తీసుకున్నారు. సయ్యద్ కలీమ్ బెయిల్ పొందగా, సయ్యద్ బిన్ ఖాలిద్‌ను న్యాయస్థానం 14 రోజుల రిమాండ్‌కు పంపింది. ఈ పక్షులను ఎక్కడి నుంచి తెచ్చారు, ముఠాలో ఇతరుల ప్రమేయం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. వన్యప్రాణులను పెంపుడు జంతువులుగా పెంచడం, విక్రయించడం నేరమని, సమాచారం ఉంటే అటవీశాఖకు తెలపాలని అధికారులు కోరారు.





సాకేరలో ఘనంగా గ్రామసభ నిర్వహణ

- **సోనాల మండలంలోని సాకేర గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారం**

అదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 09: (డిడి 9 వార్త న్యూస్)

సోనాల మండలంలోని సాకెర గ్రామాభివృద్ధి ధ్యేయంగా గ్రామసభను నిర్వహించారు.వీబీజీ రామ్ జీ గ్రామసభను సాకేర గ్రామ సర్పంచ్ మోతి సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో రత్నాకర్ రావు, స్థానిక ప్రజలు మరియు వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మరియు గ్రామంలో సీసీ కెమెరాలు పెట్టాలని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల సహకారంతోనే అభివృద్ధి జరుగుతుంది. ప్రతి సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం," అని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మిథున్ చక్రవర్తి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి రైతుల పాలాభిషేకం

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

ఆర్మూర్ నియోజకవర్గ రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యపై ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అసెంబ్లీ వేదికగా స్పందించారు. బుధవారం అసెంబ్లీ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడిన ఎమ్మెల్యే, ఖరీఫ్ సీజన్ దృష్ట్యా ఉమ్మెడ శివారులోని గుత్ప ఎత్తిపోతల నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించడంతో గుత్ప నుంచి నీటి విడుదల ప్రారంభమైంది. సాగునీరు విడుదల కావడంతో హర్షం వ్యక్తం చేసిన రైతులు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి నిజమైన రైతు పక్షపాతి అని కొనియాడారు. ఆర్మూర్‌లో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్మూర్‌లో ఉచిత మెగా క్యాన్సర్ శిబిరం విజయవంతం

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

ఆర్మూర్ నవనాథపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మెగా క్యాన్సర్ హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం డాక్టర్ అలేఖ్య, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ మన్విత, డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు ఇతర వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ సుధీర్ బాబు, లక్ష్మీనారాయణ, జీఎం గంగారెడ్డి, ఏ. తిరుపతి, వెంకట్ రామ్ రెడ్డి, రఫీఉద్దీన్ గోహర్, జగదీశ్వర్ రెడ్డి, సీ. నరహరి, రీజియన్ చైర్మన్ ఎన్. జ్ఞానసాగర్ రెడ్డి, రవి కుమార్, మోహన్ దాస్ లు, ఎస్ఎస్కే సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు జి.ఆనంద్, డీకే రాజేష్ పాల్గొన్నారు. రెండు రోజుల పాటు సేవలు అందించిన వైద్య బృందానికి వసతి సదుపాయం కల్పించిన లయన్స్ క్లబ్ ట్రస్ట్ ట్రెజరర్‌కు, సహకరించిన క్షేత్రీయ సమాజ్ పరివార్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.





బస్తీ దావఖానాను ఆకస్మిక తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

నిజామాబాద్ జిల్లా ముదక్పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఖానాపూర్ బస్తీ దావఖానాను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దావఖానాలోని సిబ్బంది హాజరు పట్టిక, వైద్య రికార్డులు, ఓపీ రిజిస్టర్, ఔషధాల స్టాక్ రిజిస్టర్లను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డిఎంహెచ్ఓ రాజశ్రీ మాట్లాడుతూ.. ప్రస్తుతం వాతావరణ మార్పుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, దావఖానాలో నివారణ మందులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ స్థానిక ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని, తద్వారా ఓపీ రోగుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలని సూచించారు. నాన్‌కమ్యూనికబుల్ డిసీజెస్ కింద జీవనశైలి వ్యాధులను ముందస్తుగా నిర్ధారించి, అవసరమైన రోగులను ఉన్నత వైద్య చికిత్స కోసం రిఫర్ చేయాలని వైద్యాధికారులకు మార్గదర్శనం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో బస్తీ దావఖానా వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ కమిషనరేట్‌లో 'కాళోజీ' జయంతి వేడుకలు

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం తెలంగాణ ప్రజాకవి, పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీపీ పి. సాయి చైతన్య ఆదేశాల మేరకు సిసిఆర్బి ఏసీపీ గురునాయుడు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సగటు మనిషి సమస్యలే వస్తువుగా కవిత్వం రాసిన మహోన్నీయుడు కాళోజీ అని కొనియాడారు. ప్రజల గొడవను తన గొడవగా భావించి జీవితాంతం ప్రజాకవిగా నిలిచారన్నారు. ఆయన స్వతంత్ర భావాలు, రచనలు సమాజానికి వన్నె తెచ్చాయని గుర్తుచేశారు. భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి బంగారు బాట వేయాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఆసియా బేగం, సూపరింటెండెంట్లు జగతి, వనమాల, ఇన్‌స్పెక్టర్లు అంజయ్య, పాండేరావు, డిపిఓ మరియు కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఘనంగా కాళోజీ 112వ జయంతి వేడుకలు

- **తెలంగాణ భాష దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం**

ఏటూరునాగారం సెప్టెంబర్09డీడీ9 వార్త

తెలంగాణ భాషా వైతాళికుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏటూరునాగారంలో ఘనంగా నిర్వహించారు.

కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. రేణుక అధ్యక్షత వహించారు. తొలుత కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాళోజీ నారాయణరావు జీవిత విశేషాలు, తెలంగాణ భాషా సాహిత్యానికి ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా తెలుగు విభాగాధిపతి కె. సంపత్ మాట్లాడుతూ కాళోజీ రచనలు ప్రజల జీవితాలను, సామాజిక సమస్యలను ప్రతిబింబించేలా ఉంటాయని తెలిపారు. కాళోజీ కవితా పంక్తి అక్షర రూపం దాల్చిన సిరా చుక్క వేయి మెదడుకు కదలికను విద్యార్థులకు వివరిస్తూ, సమాజంలో చైతన్యం తీసుకురావడంలో అక్షరానికి ఉన్న శక్తిని వివరించారు.

తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్య పరిరక్షణలో కాళోజీ నారాయణరావు చేసిన కృషి చిరస్మరణీయమని అధ్యాపకులు పేర్కొన్నారు. విద్యార్థులు తెలంగాణ భాషా సాహిత్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డి. నవీన్, సిహెచ్. వెంకటయ్య, డాక్టర్ పి. జ్యోతి, కనీస్ ఫాతిమా, జీవవేణి, రమేశ్, శ్రీధర్, రాజశేఖర్, భావన భారతి, భాస్కర్, శ్రీకాంత్, ప్రశాంతి తదితరులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



అసంపూర్తి రహదారి నిర్మాణంతో ప్రజలకు తిప్పలు

- **రెండు నెలలుగా పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి**
- **ప్రజల ఇబ్బందులు పట్టించుకోని ప్రజా ప్రభుత్వం ఇదేనా? – కుడుముల లక్ష్మీనారాయణ**

మంగపేట సెప్టెంబర్ 09డీడీ9 వార్త

మల్లూరు గ్రామం నుంచి నర్సింహసాగర్ వెళ్లే ప్రధాన రహదారిలో కోట్లబోరు-సప్టా నుంచి గ్రామ శివారు వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. సుమారు రెండు నెలలుగా పనులను మధ్యలోనే నిలిపివేయడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా సీనియర్ నాయకులు కుడుముల లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శాఖ పరిధిలోనే ఈ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ, రెండు నెలలుగా పనులు నిలిచిపోవడం మంత్రి దృష్టికి రాలేదా? అని ప్రశ్నించారు. ప్రధాన రహదారిపై సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేయడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు.

రహదారి మొత్తం వెడల్పును పూర్తి చేయకుండా ఒకవైపు మాత్రమే నిర్మాణం చేపట్టి పనులు నిలిపివేయడంతో లారీలు, బస్సులు వంటి భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు నిర్మాణం కోసం ఏర్పడిన ఎత్తుపల్లాల కారణంగా మోటార్‌సైకిళ్లను పక్కకు దించేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందన్నారు.

ఈ ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే శనగకుంట, గొందిగూడెం, మొట్లగూడెం, పురేడిపల్లి, నరేంద్రరావుపేట, మల్లూరు, నర్సింహసాగర్ తదితర గ్రామాల ప్రజలు ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా నర్సింహసాగర్ గ్రామానికి వెళ్లే బస్సు సైతం రహదారి పరిస్థితి కారణంగా మల్లూరు నుంచి వెనక్కి తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మంగపేట మండల కేంద్రానికి వెళ్లేందుకు సుమారు ఐదారు గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో అసంపూర్తి నిర్మాణం వారి రోజువారీ రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు, వృద్ధులు, విద్యార్థులు, ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగే విధంగా పనులను మధ్యలోనే నిలిపివేసిన సదరు కాంట్రాక్టర్‌పై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కుడుముల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేసి ప్రజలకు సురక్షితమైన రాకపోకల సౌకర్యం కల్పించాలని కోరారు.

"ప్రజా పాలన" అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కనీస రహదారి సౌకర్యం కూడా కల్పించలేకపోవడం దురదృష్టకరం. సగం రోడ్డు నిర్మాణం చేసి రెండు నెలల పాటు వదిలేయడమేనా మీరు చెప్పే ప్రజా పాలన? ఇదేనా మీరు చెబుతున్న అభివృద్ధి? అని కుడుముల లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. అధికారులు వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ సమస్యపై బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మల్లూరు దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, పార్టీ నాయకులు కోరెం నర్సింహులు, చిన్నల చక్రధర్, పూజారి శ్రీనివాస్, అరెల్లి దేవేందర్, చల్లగురుగుల తిరుపతి, భూట్లో, రావుల రమణ, నాలి కాంతారావు, పంజాల సత్యం, నాలి బుచ్చయ్య, సోషల్ మీడియా వారియర్స్ బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి, గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ కు ప్రాణహాని కలిగించే కుట్రపై మణుగూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదుచేసిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు.

మణుగూరు. సెప్టెంబర్ 9(డి డి 9వార్త)


తెలంగాణ రాష్ట్ర సాధకుడు,ఉద్యమ నాయకుడు ,మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పై కుట్ర పూరితంగా హత్యాయత్నానికి పాల్పడుతున్న వారిపై వెంటనే కేసు నమోదు చేయాలి అని, అలాగే నిన్న అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలు,షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్ చేసిన తీవ్ర వ్యాఖ్యలపై (కేసీఆర్ ను చంపాలి అని) మీడియాలో,ప్రత్యేక ప్రసారాలలో, సోషల్ మీడియాలలో, వచ్చిన వార్తలను పరిశీలించి ,ఒక ప్రజా నాయకుడు పైన హత్యాయత్నానికి పాల్పడిన కుట్రదారులను తగు విచారణ జరిపి హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలి అని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మణుగూరు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు.

పెద్దమ్మ తల్లి దేవస్థానానికి అధికారిక గుర్తింపు.

- **రాళ్లవాగు శ్రీ పెద్దమ్మ తల్లి దేవస్థాన కమిటీ రిజిస్ట్రేషన్ పూర్తి.**

మణుగూరు. సెప్టెంబర్ 9(డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,కరకగూడెం మండలంలోని భట్టుపల్లి (రాళ్లవాగు)నందు ప్రసిద్ధి పొందిన శ్రీ పెద్దమ్మ తల్లి దేవస్థానానికి స్థానిక కమిటీ రిజిస్ట్రేషన్ పూర్తయింది.కమిటీకి రిజిస్ట్రేషన్ నంబర్ 181 కేటాయించినట్లు కమిటీ సభ్యులు సారిక.లింగయ్య తెలిపారు.కార్తీక పౌర్ణమికి ఆలయ అభివృద్ధి,భక్తులకు సౌకర్యాల కల్పన,ఆధ్యాత్మిక కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించేందుకు కమిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు.భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మంగపేటలో మండల ప్రత్యేక సమావేశం

- **శాఖల వారీగా ప్రగతి నివేదికలపై సమీక్ష**

మంగపేట సెప్టెంబర్ 09డీడీ 9 వార్త

మండల ప్రత్యేక సమావేశం మండల ప్రత్యేక అధికారి కె. కొండయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.

సమావేశంలో ఆయా శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, వాటి పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

ఈ సమావేశానికి మంగపేట ఎంపీడీఓ శ్రీ భద్రు, తహసీల్దార్ శ్రీ తోట రవీందర్, డీఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ ఆజార్, ఇరిగేషన్ అధికారి రోహిత్, హౌసింగ్ ఏఈ మనస్విని, ఏపీఎం సత్యనారాయణ, వి.బి.జి. రామ్‌జీ ఏపీఓ అంకుష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

మండల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై శాఖల వారీగా సమీక్ష జరిపి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

విద్యార్థులు అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని అలవర్చుకోవాలి

- **ఊరట్టం ఆశ్రమ పాఠశాలలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు**
- **ఊరట్టం గిరిజన ఆశ్రమ పాఠశాల**
- **ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.**

తాడ్వాయిడిడి9 వార్త

తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కల్తీ శ్రీనివాస్ హాజరై, కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు

అనంతరం ఆయన మాట్లాడుతూ కాళోజీ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు. 'అన్యాయాన్ని ఎదిరిస్తేనే నాఎదుట మనిషివి' అని చాటిన గొప్ప మానవతావాది. విద్యార్థులు ఆయన స్ఫూర్తితో అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని అలవర్చుకోవాలి" అని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు కాళోజీ కవితా పఠనం, ఉపన్యాస, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు తెలుగు ఉపాధ్యాయులు మాట్లాడుతూ కాళోజీ సాహిత్య సేవలను, తెలంగాణ భాషా, సంస్కృతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ, డిప్యూటీ వార్డెన్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు ప్రధానోపాధ్యాయులు కల్తీ శ్రీనివాస్ ఊరట్టం ఆశ్రమ పాఠశాల





మండల స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న .. అధికారులు & ప్రజా ప్రతినిధులు

- **సుమారు 30 లక్షల రూపాయల నిధులతో క్రీడా మైదానాల అభివృద్ధి చేసిన..**
- **పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

మణుగూరు. సెప్టెంబర్ 9(డి డి 9వార్త)

భద్రాద్రి జిల్లా,మణుగూరు మండలం, జిల్లా పరిషత్ హై స్కూల్(ZPHS) లో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, ఎంఇఓ స్వర్ణ జ్యోతి, ఎండిఓ శ్రీకాంత్,ఎంపీఓ వెంకటేశ్వరరావు, సిఐ నాగబాబు,ZPHS హెచ్ఎం నాగశ్రీ, రామంజవరం కాంప్లెక్స్ హెచ్ఎం యశోద తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయన్నారు. విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరిగిందని దానిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానానికి వెళ్లాలని అన్నారు.పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు క్రీడలను మరియు క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు,ZPHS క్రీడా మైదానాన్ని 10 లక్షలు నిధులతో అభివృద్ధి చేయడం జరిగిందని అలాగే డిగ్రీ కళాశాల క్రీడా మైదానానికి 15 లక్షల రూపాయల నిధులను కేటాయించి పనులను ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడి లు అనిల్ కుమార్,ఆదినారాయణ మరియు ఉపాధ్యాయులు వి.వి. కోటేశ్వరరావు, బి శేఖర్ మండలంలో వివిధ స్కూళ్ల నుండి క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





మెడ్‌ప్లస్‌లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 11న ప్రత్యక్ష ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డాక్టర్ వేల్పుల విజేత తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని 'మెడ్‌ప్లస్' సంస్థలో ఫార్మసిస్ట్, ఫార్మసీ ఎయిడ్ ఉద్యోగ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. డి.ఫార్మసీ, బి.ఫార్మసీ పూర్తి చేసి ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారు ఫార్మసిస్ట్, ఇంటర్మీడియట్ అర్హతతో మూడేళ్ల అనుభవం ఉన్నవారు ఫార్మసీ ఎయిడ్ పోస్టులకు అర్హులని తెలిపారు. ఈ పోస్టులకు వేతనం రూ.20 నుంచి రూ.25 వేలు జీతం ఉంటుందని, అభ్యర్థుల వయోపరిమితి 32 ఏళ్లలోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 11న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల లోపు నిజామాబాద్‌లోని శివాజీ నగర్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరుకావాలన్నారు. వచ్చేవారు బయోడేటా, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, విద్యా అర్హతల సర్టిఫికెట్లతో నేరుగా రావాలని కోరారు.


సాలూర సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదం

- **సాలంపాడ్ కు చెందిన వ్యక్తి దుర్మరణం**
- **రోడ్డుపై బైఠాయించి బంధువుల రాస్తారోకో**
- **ఎస్సై హామీతో విరమించిన గ్రామస్థులు**

బోధన్, నిజామాబాద్ జిల్లా ,
సెప్టెంబర్ 09(డీడీ9 వార్త):

రోడ్డు పక్కన అక్రమంగా వేసిన ఇసుక కుప్పలు ఒక నిరుపేద కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపాయి. సాలూర-బోధన్ ప్రధాన రహదారిలోని సాలూర సబ్‌స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో సాలంపాడ్ గ్రామానికి చెందిన బొర్రా గంగారాం (43) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రోజువారీ కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని, బుధవారం సాలూర నుంచి సాలంపాడ్ కు వెళ్తుండగా సాలూర సబ్‌స్టేషన్ వద్ద రహదారిపై వేసిన ఇసుక కుప్పల వల్ల ప్రమాదం చోటు చేసుకుని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు. ప్రమాద వార్త తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకుని సాలూర-బోధన్ రహదారిపై బైఠాయించారు. రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా ఇసుక కుప్పలు వేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తిని కోల్పోయిన బాధిత కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. దీంతో సాలూర-సాలంపాడు మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ప్రమాదానికి కారణమైన అంశాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, మృతుడి కుటుంబానికి చట్టపరంగా తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎస్సై హామీతో గ్రామస్థులు ఆందోళనను విరమించగా, పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.





మణుగూరు మున్సిపాలిటీలో గ్రామాలకు తక్షణమే మంచినీరు విడుదల చేయాలి..

- **దుర్గ్యాల సుధాకర్**
- **(సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి).**

మణుగూరు. సెప్టెంబర్ 9 (డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా రోజు విడిచి రోజు మంచినీరు అందించేవారు. గత నాలుగు రోజులుగా గ్రామాలకు మంచినీరు సరఫరా నిలిచి పోవడంతో మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ పేర్కొన్నారు.

బావులు లేక బోరు లేక కేవలం మిషన్ భగీరథ పంపుల ద్వారా వచ్చే నీటినే తాగుతున్నారని, మంచినీరు నాలుగు రోజులుగా రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పిల్లలకు స్నానాలు చేయించాలన్న, మంచినీరు తాగాలన్న,ఇంట్లో పనులు చేయాలన్న ,మంచినీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని ఎప్పుడు మంచి నీరు వస్తాయో కనీసం ప్రజలకు సమాచారం కూడా లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. మున్సిపాలిటీ ద్వారా మంచినీరు అందించలేని పక్షంలో సింగరేణి సంస్థ ట్యాంకుల ద్వారానైనా గ్రామ ప్రజలకు మంచినీరు అందించి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది కానీ ఈ విషయాన్ని ఎవరు పట్టించుకునే పరిస్థితి లేదు.

ఏ రోజుకు ఆరోజే పంపులు వస్తాయని చెబుతూ నాలుగు రోజులు గడిచిన నేటికీ మోటర్ రిపేర్ కాక పోవడంతో త్రాగునీరు అందించడంలో మున్సిపాలిటీ పూర్తిగా విఫలం చెందిందని,ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ శాఖ కమీషనర్ దీనిపై దృష్టి సారించి వెంటనే మోటర్ రిపేర్ చేయించి , మణుగూరు మున్సిపాలిటీ ప్రజలందరికీ, గ్రామాలకు మంచినీరు అందేలా చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ప్రత్యామ్నాయం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఆధర్ల రాములు, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, బోశెట్టి సంపత్ తదితరులు పాల్గొన్నారు.



28వ వార్డులో రహదారి అభివృద్ధికి శ్రీకారం

జనగామ సెప్టెంబర్9 (డిడి 9వార్త)బ్యూరో

జనగామ మున్సిపాలిటీ 28వ వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణిశ్రీనివాస్ ప్రారంభించారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఫాతిమా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు, అధికారులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

సర్వే నంబర్ 209లోనే నూతన ఐటీడీఏ భవనం నిర్మించాలి

- మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య డిమాండ్

మంగపేట సెప్టెంబర్ 09డీడీ 9 వార్త



ములుగు జిల్లా షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతమైన ఏటూరు నాగారంలో ఆదివాసులకు అందుబాటులో ఉండే ప్రాంతంలోనే నూతన ఐటీడీఏ భవనాన్ని నిర్మించాలని మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య డిమాండ్ చేశారు.

ఆదివాసుల అభివృద్ధి, వారి సమస్యల పరిష్కారం, గిరిజన చట్టాలు, జీవోలు, రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ నిబంధనల అమలుకు 1974లో తొలిసారిగా ఐటీడీఏ కార్యాలయాన్ని వరంగల్‌లో ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. అనంతరం ఏజెన్సీ ప్రాంతంలోనే ఐటీడీఏ కార్యాలయం ఉండాలనే ఉద్దేశంతో 1985లో అప్పటి పీఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో వరంగల్ నుంచి ఏటూరు నాగారం మండల పరిధిలోని ఆకులవారి ఘనపురం ప్రాంతానికి కార్యాలయాన్ని మార్చినట్లు పేర్కొన్నారు.

ప్రస్తుతం రూ.16 కోట్ల నిధులతో నూతన ఐటీడీఏ భవనాన్ని ఏటూరు నాగారం మండల పరిధిలోని ఎక్కేళ్ల గ్రామ శివారులో ఆర్టికల్చర్, సెరికల్చర్ తదితర ప్రభుత్వ శాఖలకు కేటాయించిన స్థలంలో నిర్మించేందుకు ప్రభుత్వం ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోందని, ఈ నిర్ణయాన్ని మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని గొప్ప వీరయ్య తెలిపారు.

ఐటీడీఏ కార్యాలయం ఇప్పటికే రహదారికి సమీపంలో ఉన్నప్పటికీ మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే ఆదివాసీ ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాంటిది మరింత మారుమూల ప్రాంతంలో ఐటీడీఏ భవనాన్ని నిర్మిస్తే రవాణా సౌకర్యం లేక ఆదివాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆదివాసీ ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా రహదారి పక్కనే ప్రభుత్వ కార్యాలయాలు, ఐటీడీఏ కార్యాలయం ఉండాలని ఆయన అన్నారు. ఆకులవారి ఘనపురం గ్రామ శివారులోని సర్వే నంబర్ 209లో సుమారు 125.26 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో సుమారు 22.06 గుంటలు చెరువు శిఖం భూమి కాగా, మిగిలిన ప్రభుత్వ భూమిలో 10 ఎకరాలను కేటాయించి రూ.16 కోట్లతో నూతన ఐటీడీఏ భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు.

గతంలో చందూలాల్ మంత్రిగా ఉన్న సమయంలో కూడా ఎక్కేళ్ల శివారులో ఐటీడీఏ భవనం నిర్మించేందుకు ప్రయత్నాలు జరిగాయని, అయితే అప్పట్లో ఆదివాసీ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించి అడ్డుకున్నాయని గుర్తుచేశారు.

మంత్రులు, గిరిజన ఎమ్మెల్యేలు, గిరిజన ఎంపీలు, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ఆదివాసులకు అందుబాటులో ఉండే ప్రాంతంలోనే నూతన ఐటీడీఏ భవనాన్ని నిర్మించాలని గొప్ప వీరయ్య కోరారు.

ఈ కార్యక్రమంలో మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈసం యాదయ్య, జిల్లా అధ్యక్షుడు ఈసం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోలేం సుధాకర్, మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీడ్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ మేడారం లో పర్యటన

తాడ్వాయి డిడి9 వార్త

మేడారంలో సమ్మక్క సారలమ్మ తల్లులను సీడ్ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర చైర్మన్, టీపీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేస్ రెడ్డి దర్శించుకొని మొక్కులు చెల్లించారు సమ్మక్క పూజారి సిద్దబోయిన రానా రమేష్ కండువా కప్పి ప్రసాద్ బహూకరించడం జరిగింది ఈ కార్యక్రమంలో సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్ తదితరులు పాల్గొన్నారు





ఫామ్‌హౌస్ శుద్ధిపై దళితుల ఆగ్రహం

జనగామ సెప్టెంబర్ 9 (డిడి 9 వార్త)బ్యూరో



దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉందన్న ఎర్ర క్రాంతి దళిత సామాజిక వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్‌ను అవమానించేలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు, దళితులు మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించిన విషయం తెలిసిందే. అనంతరం ఫామ్‌హౌస్ ప్రాంగణాన్ని పసుపు నీరు, పాలతో శుద్ధి చేయడంపై లింగాల ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకుడు ఎర్ర క్రాంతి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దళితులు నిరసన తెలిపిన ప్రదేశాన్ని శుద్ధి చేయడం వారి ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యగా భావిస్తున్నామని ఆయన అన్నారు. ఇలాంటి చర్యలు సామాజిక సమానత్వానికి విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ కులం పేరుతో ఏ వర్గాన్నీ అవమానించరాదని, దళితుల గౌరవాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎర్ర క్రాంతి కోరారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- రఘునాథపల్లిలో బీజేపీ వినతి

జనగామ సెప్టెంబర్ 9 (డిడి వార్త) బ్యూరో

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కావటి ముత్యాలు డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గోదారిఇసుకకొల్లగొట్టి,,,కోట్ల కు పడగలెత్తి,,,!!

- పాలాయిగూడెం–చుంచుపల్లి పరిసరాల్లో యథేచ్ఛగా ఇసుక తరలింపుపై ఆరోప నలు,,,,
- అనుమతుల పేరుతో అక్ర మరవాణా సాగుతోంది,
- చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నామమాత్రమేనా..?
- అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?

ఏటూరునాగారం

క్రైం,డి డి 9వార్త , సెప్టెంబర్ 10

గోదావరి ఇసుకకు డిమాండ్ పెరగడంతో అక్రమార్కుల కన్ను సహజ వనరులపై పడిందనే ఆరోపణలు విని పిస్తున్నాయి. ములుగు జిల్లా మంగపేట మండలం లోని పాలాయిగూడెం, చుం చుపల్లి,వాడగూడెం పరిసర గోదావరి తీర ప్రాంతాల నుంచి భారీగా ఇసుకను లారీల్లో తరలిస్తు న్నారని స్థానికులు ఆందోళ న వ్యక్తం చేస్తున్నా రు.అను మతుల పేరుతో అధికంగా ఇసుకను తరలిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోదావరి తీరంలో నాణ్యమైన ఇసుక విస్తారంగా లభిస్తుండటంతో కొందరు అక్రమార్కులు దీనిపై కన్నేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ర్యాంపుల వద్ద నుంచి ప్రారంభమయ్యే ఇసుక తరలింపు మంగపేట, ఏటూరునాగారం ,తాడ్వాయి,పస్రా తదితర మార్గాల మీదుగా సాగుతోందని చెబుతున్నారు.రోజూ పెద్ద సంఖ్యలో లారీలు రాకపోకలు సాగిస్తున్నాయని,దీంతో రహదారులు దెబ్బతినడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక తవ్వకాలతో సహజ వనరులకు ముప్పు....

గోదావరి తీరంలో భారీగా ఇసుక తవ్వకాలు కొనసాగితే పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక మేటలను తొలగించడం వల్ల భూగర్భ జలాలపై ప్రభావం పడటంతో పాటు భవిష్యత్‌లో నీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.సహజ వనరులను కాపాడాల్సిన అధికారులు ఇసుక తరలింపుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నామమాత్రమేనా..?

ఇసుక లారీల రాకపోకలపై పలు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు జరుగుతున్నప్పటికీ,అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.కొన్ని చోట్ల లారీలను తనిఖీ చేస్తున్నట్లు కనిపించినా,కొద్దిసేపటికే అవి ఎలాంటి అడ్డంకులు లేకుండా వెళ్లిపోతున్నాయని స్థానికులు అంటున్నారు.మంగపేట, ఏటూరునాగారం,తాడ్వాయి, మేడారం,పస్రా ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల మీదుగా ఇసుక లారీలు వెళ్తున్నాయని,భారీ సంఖ్యలో లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రహదారులపై దుమ్ము,ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు.

'ఒక్క ఫోన్‌తో లారీ విడుదల'.ఆరోపణలపై విచారణ ఏదీ...?

అక్రమ ఇసుక రవాణాపై స్థానికులు మరిన్ని ఆరోపణలు చేస్తున్నారు. లారీలను పట్టుకున్నప్పటికీ పలుకుబడి ఉన్న వ్యక్తుల ఫోన్‌లతో వాటిని వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.చెక్‌పోస్టుల వద్ద నిబంధనల ప్రకారం జరగాల్సిన తనిఖీలు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయా..? అనుమతులు, రవాణా పత్రాలు సక్రమంగా ఉన్నాయా..? అనే విషయాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.

'లారీలు పోతుంటే అధికా రులు ఏం చేస్తున్నారు...?'

గోదావరి తీరంలో ఇసుక తవ్వకాలు, రవాణా భారీ స్థాయిలో జరుగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.అనుమతుల పరిధిని మించి ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా..? ర్యాంపుల నుంచి ఎంత మొత్తంలో ఇసుక తరలిస్తున్నారు..? రోజుకు ఎన్ని లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి..? అనే అంశాలపై అధికారులు లెక్కలు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. గోదావరి ఇసుక సహజ సంపద అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.ఆరోపణలపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి,అక్రమాలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.









అడవిలో అక్రమ తవ్వకాలు.. నాశనమవుతున్న చెట్లు....!

- ఊరట్టం సమీప అటవీ ప్రాంతంలో యంత్రాలతో మట్టి తవ్వకాలు
- ట్రాక్టర్లతో యథేచ్ఛగా తరలింపు.. జాతర కోసం మట్టి సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు
- అటవీశాఖ అధికారుల మధ్య పరిధి పంచాయితీ..
- అక్రమార్కులకు అడ్డులేకుండా పోయిందని గ్రామస్తుల ఆవేదన

ఏటూరునాగారం క్రైం, సెప్టెంబర్ 10:

అడవులను కాపాడాల్సిన అటవీశాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అక్రమార్కులు అటవీ ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏటూరునాగారం పరిధిలోని ఊరట్టం సమీపంలో అటవీ ప్రాంతంలో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. యంత్రాలతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిషన్లతో తవ్వకాలు.. ట్రాక్టర్లతో తరలింపు

ఊరట్టం సమీపంలోని శ్మశానవాటిక ఎదురుగా ఉన్న అటవీ ప్రాంతంలో కొందరు అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం.ఎలాంటి అనుమతులు ఉన్నాయో స్పష్టత లేకపోయినా యంత్రాలను ఉపయోగించి మట్టిని తవ్వుతూ ట్రాక్టర్లలో తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో అటవీ భూమి స్వరూపం మారడంతో పాటు చెట్లు,సహజ వనరులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతర ముసుగులో మట్టి వ్యాపారం...?

మేడారం జాతరను ఆసరాగా చేసుకుని తవ్విన మట్టిని జాతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన పాతవాట్లు, షాపుల ఎదుట పోస్తూ ఒక్కో ట్రాక్టర్‌కు రూ.450 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఒకవైపు జంపన్నవాగు నుంచి ఇసుక తరలింపు, మరోవైపు అటవీ ప్రాంతం నుంచి మట్టి తరలింపు జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

'ఆ ఏరియా మా పరిధి కాదు'.. అధికారుల సమాధానాలపై విమర్శలు

ఊరట్టం సమీప అటవీ ప్రాంతంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ,సంబంధిత సిబ్బంది తమ పరిధి కాదంటూ తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.మేడారం వైల్డ్‌లైఫ్ ఎఫ్ఆర్ఓ ఎల్లయ్యను సంప్రదించగా,ఆ ప్రాంతం తమ పరిధిలోకి రాదని, ఏటూరునాగారం-దొడ్ల-కొండాయి ప్రాంత అధికారుల పరిధిలో ఉంటుందని తెలిపినట్లు సమాచారం. అయితే అడవి నాశనం జరుగుతున్నప్పుడు పరిధి ఎవరిదనే ప్రశ్న కంటే,అక్రమ తవ్వకాలను అడ్డుకోవడం ముఖ్యమని స్థానికులు అంటున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి...

అటవీ ప్రాంతంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై అటవీశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.సంఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించి,తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ తవ్వకాలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కూడా శాఖాపరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అడవిని కాపాడాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమైతే.. అక్రమార్కులకు అటవీ సంపద అడ్డూ అదుపూ లేకుండా దోచుకునే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.







ఘనంగా కాళోజీ 112వ జయంతి వేడుకలు

- తెలంగాణ భాష దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం

ఏటూరునాగారం సెప్టెంబర్09డీడీ9 వార్త

తెలంగాణ భాషా వైతాళికుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏటూరునాగారంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి. రేణుక అధ్యక్షత వహించారు. తొలుత కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాళోజీ నారాయణరావు జీవిత విశేషాలు, తెలంగాణ భాషా సాహిత్యానికి ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.

ఈ సందర్భంగా తెలుగు విభాగాధిపతి కె. సంపత్ మాట్లాడుతూ కాళోజీ రచనలు ప్రజల జీవితాలను, సామాజిక సమస్యలను ప్రతిబింబించేలా ఉంటాయని తెలిపారు. కాళోజీ కవితా పంక్తి అక్షర రూపం దాల్చిన సిరా చుక్క వేయి మెదడుకు కదలికను విద్యార్థులకు వివరిస్తూ, సమాజంలో చైతన్యం తీసుకురావడంలో అక్షరానికి ఉన్న శక్తిని వివరించారు.

తెలంగాణ భాష, సంస్కృతి, సాహిత్య పరిరక్షణలో కాళోజీ నారాయణరావు చేసిన కృషి చిరస్మరణీయమని అధ్యాపకులు పేర్కొన్నారు. విద్యార్థులు తెలంగాణ భాషా సాహిత్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డి. నవీన్, సిహెచ్. వెంకటయ్య, డాక్టర్ పి. జ్యోతి, కనీస్ ఫాతిమా, జీవవేణి, రమేశ్, శ్రీధర్, రాజశేఖర్, భావన భారతి, భాస్కర్, శ్రీకాంత్, ప్రశాంతి తదితరులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏపీవో జనరల్

- **ఐటీడీఏ సబ్ స్టేషన్ పనులు వేగవంతం చేయాలి**
- **త్వరలోనే 33/11 కేవీ సబ్ స్టేషన్ ప్రారంభించాలి**
- **సుమారు 5 వేల కుటుంబాలకు నిరంతర విద్యుత్ సరఫరా**
- **ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్**

భద్రాచలం (డీడీ 9 వార్త), సెప్టెంబర్ 9:

భద్రాచలం ఐటీడీఏ కాంప్లెక్స్ , నివాస గృహాలు, పరిసర శివారు కాలనీల్లో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నిర్మిస్తున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం వెనుక నిర్మిస్తున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ పనులను ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ నివాస గృహాలు, సిబ్బంది క్వార్టర్లు, పరిసర శివారు కాలనీల్లో తరచూ లోవోల్టేజీ, విద్యుత్ అంతరాయాల సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. దీంతో ఇళ్లలోని ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతింటున్నాయని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో సబ్ స్టేషన్ నిర్మాణానికి మార్చి నెలలో శ్రీకారం చుట్టినట్లు వివరించారు. సబ్ స్టేషన్ నిర్మాణంతో పాటు విద్యుత్ లైన్ల



ఏర్పాటు పనులను సమాంతరంగా చేపట్టి త్వరితగతిన సరఫరా పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ విద్యుత్ శాఖ అధికారి వేణు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

- **కేంద్ర బండి సంజయ్ కు ఘన స్వాగతం**
- **సారపాక ఐటీసీ అతిథి గృహంలో బీజేపీ నాయకుల ఆత్మీయ స్వాగతం**

భద్రాచలం (డీ డీ 9 వార్త), సెప్టెంబర్ 9

భద్రాచలం పర్యటనలో భాగంగా సారపాకలోని ఐటీసీ అతిథి గృహానికి విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు భద్రాచలం భారతీయ జనతా పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ భద్రాచలం నియోజకవర్గం తరఫున నాయకులు మంత్రిని శాలువాతో సత్కరించి ఆత్మీయంగా స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా పార్టీ కార్యకలాపాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై బండి సంజయ్ కుమార్ తో నాయకులు చర్చించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, భద్రాచలం ప్రాంత అభివృద్ధికి కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందేలా కృషి చేయాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ భద్రాచలం పర్యటన సందర్భంగా స్థానిక బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని నాయకులు తెలిపారు. భద్రాచలం ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్ , నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రాంమోహన్ రావు, అట్లూరి రఘురామ్ , ముత్యాల శ్రీనివాస్ , బోడ సత్యనారాయణ, ములిశెట్టి నిఖిల్ , అన్నెం సాయి లక్ష్మణ్ , మాలోత్ సాయి వినోద్ తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న దృశ్యం

- **ఐటీడీఏ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ జయంతి**

భద్రాచలం (డీడీ 9 వార్త), సెప్టెంబర్ 9:

భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు 113వ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు, అన్యాయాలకు వ్యతిరేకంగా కాళోజీ తన కలంతో పోరాడిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడని కొనియాడారు. ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం జీవితాంతం పోరాడిన కాళోజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని గిరిజనుల సంక్షేమానికి అధికారులు, సిబ్బంది మరింత సేవ చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఎస్ డీసీ ఆనంద్ కుమార్, పీవీటీజీ అధికారి గన్యా నాయక్, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్ తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రామాలయంలో బండి సంజయ్, కుటుంబ సభ్యులు

- **కుటుంబ సమేతంగా భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్**

భద్రాచలం (డీడీ 9 వార్త), సెప్టెంబర్ 9:

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు బండి సంజయ్ కు వేదాశీర్వచనం అందజేశారు. దేవస్థానం ఈవో కే. దామోదర్ రావు దేవస్థానం తరఫున మంత్రికి జ్ఞాపికను అందజేశారు.
అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే భద్రాద్రి రామయ్యను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, దేశ ప్రధాని నరేంద్ర మోదీతో పాటు రాష్ట్ర, దేశ ప్రజలందరికీ మంచి జరగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- **అయిదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలి**
- **కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు కాంగ్రెస్ నాయకుల వినతి**

భద్రాచలం (డీడీ 9 వార్త), సెప్టెంబర్ 9:

ఆంధ్రప్రదేశ్ లో విలీనమైన భద్రాచలం మండలంలోని అయిదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం మండలంలో విలీనం చేయాలని కోరుతూ భద్రాచలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర పెఠిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని కలిసి ఆయా గ్రామాల సమస్యలను వివరించారు. భద్రాచలం మండలంలో గతంలో ఉన్న ఏటపాక, పురుషోత్తపట్నం, కన్నాయిగూడెం, గుండాల, పిచుకలపాడు గ్రామపంచాయతీలు రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ లో విలీనం కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు అనేక పరిపాలనా, అభివృద్ధి సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. భౌగోళికంగా, సామాజికంగా, ఆర్థికంగా భద్రాచలంతో విడదీయరాని సంబంధం ఉన్న ఈ గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలం మండలంలో కలపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయిదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలోని భద్రాచలం మండలంలో విలీనం చేసేలా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ ను కోరారు. ఈ విషయంపై స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అయిదు గ్రామపంచాయతీల సర్పంచ్ లతో ఏకగ్రీవ తీర్మానం చేయించి, ఆ తీర్మానంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి వినతిపత్రం సమర్పించేందుకు సమయం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామపంచాయతీలు ఆంధ్రప్రదేశ్ లో విలీనం కావడం వల్ల ప్రజలు పరిపాలనా పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.



హెల్త్ కార్డులను పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి

- **న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ**

భద్రాచలం (డీడీ 9 వార్త), సెప్టెంబర్ 9

న్యాయవాదుల సంక్షేమం, ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని భద్రాచలం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కోర్టు ప్రాంగణంలో హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై న్యాయవాదులకు హెల్త్ కార్డులను అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్ మాట్లాడుతూ న్యాయవాదుల ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ కార్డులు ఎంతో ఉపయోగకరమన్నారు. జనరల్ సెక్రటరీ పూసాల శ్రీనివాసాచారి మాట్లాడుతూ 2019 తర్వాత ఎన్రోల్ అయిన న్యాయవాదులకు ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పాపినేని కృష్ణ కుమార్ , ఎం.వి. రమణరావు, కోట దేవదాసం తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి ఖమ్మం అభివృద్ధి శూన్యం

- **కాంగ్రెస్ కు ఒక్క సీటు కూడా రాదు**
- **బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్**

భద్రాచలం (డీడీ 9 వార్త), సెప్టెంబర్ 9

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి శూన్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. బుధవారం భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మంత్రులు పరస్పరం కొట్లాడుకోవడం తప్ప జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. అవకాశం వస్తే సీఎం సీట్లో కూర్చోవాలన్న తాపత్రయమే తప్ప ప్రజల కోసం ఏం సాధించారని ప్రశ్నించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ఒక్క అసెంబ్లీ సీటు కూడా గెలిచే పరిస్థితి లేదని బండి సంజయ్ జోస్యం చెప్పారు. ఖమ్మం జిల్లాలో బీజేపీ క్యాడర్ బలంగా ఉందని, గతంలో నిర్వహించిన నిరుద్యోగ మార్చ్ , అమిత్ షా సభలకు భారీగా ప్రజలు తరలివచ్చారని గుర్తుచేశారు. ఈసారి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. మోదీ ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని బండి సంజయ్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేశామని, పాల్వంచ ఇండస్ట్రియల్ పార్క్ అప్ గ్రేడేషన్ కు రూ.8 కోట్ల గ్రాంట్ ఇచ్చామని తెలిపారు. ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ హైవేకు ఐదు ప్యాకేజీల కింద దాదాపు రూ.4 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, కోదాడఖమ్మంకాపూరి రోడ్డు జాతీయ రహదారి నిర్మాణానికి రూ.446 కోట్లు ఆమోదించామని చెప్పారు.



సర్పంచుల హక్కులు, గ్రామాల అభివృద్ధికి వినతి

- **కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన జిల్లా సర్పంచులు**

జనగామ9 (డిడి 9వార్త)బ్యూరో

జనగామ: సర్పంచులకు తగిన అధికారాలు, నిధులు కల్పించడంతోపాటు గ్రామ పంచాయతీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జనగామ జిల్లా సర్పంచులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, నర్మెట్ట సర్పంచ్ గోపగోని శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని, సర్పంచులకు రావాల్సిన హక్కులు కల్పించాలని కోరారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులుగా సర్పంచులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచుల హక్కుల సాధన, గ్రామాల అభివృద్ధి కోసం ఐక్యంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

గోవిందరావుపేట సమీపంలో లారీని ఢీకొన్న డీసీఎం..!

- **డీసీఎం డ్రైవర్‌కు గాయాలు.. ఆసుపత్రికి తరలింపు**
- **సంఘటనా స్థలానికి చేరుకున్న పస్రా ఎస్ఐ.. ట్రాఫిక్ క్లియర్**
- **వాహనాలను పక్కకు తరలించి రాకపోకలను పునరుద్ధరించిన పోలీసులు**

ములుగు జిల్లా క్రైం, నాడు నేడు:

ములుగు జిల్లా గోవిందరావుపేట సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.గోవిందరావుపేట వైపు నుంచి గ్రామ శివారులోని లారీ కార్యాలయం వైపు వెళ్తున్న లారీని, పస్రా వైపు నుంచి గోవిందరావుపేటకు వస్తున్న డీసీఎం వాహనం వెనుక వైపు నుంచి ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో డీసీఎం వాహనం ముందు భాగం దెబ్బతినగా,డ్రైవర్‌కు గాయాలయ్యాయి.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన డీసీఎం డ్రైవర్‌కు సహాయం అందించారు.అనంతరం అంబులెన్స్ ద్వారా అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ప్రమాదం కారణంగా కొద్దిసేపు రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.సమాచారం అందుకున్న వెంటనే పస్రా ఎస్ఐ తాజొద్దీన్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.ప్రమాదానికి గురైన వాహనాలను రహదారి నుంచి పక్కకు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ప్రమాదం జరిగిన సమయంలో స్థానికులు,లారీ యజమానులు సహాయక చర్యల్లో పాల్గొని పోలీసులకు సహకరించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.





నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రాల్ మ్యాప్‌లో పనుల వివరాలు పరిశీలిస్తున్న పీవో రాల్

- **దేవస్థానం పనులు వేగవంతం చేయాలి**
- **ముక్కోటి ఏకాదశి నాటికి ఉత్తర ద్వారం సిద్ధం చేయాలి**
- **శ్రీరామనవమిలోపు అన్ని పనులు పూర్తి చేయాలి**
- **గోదావరి పుష్కరాల నాటికి ఘాట్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**
- **ఐటీడీఏ పీవో బి.రాహుల్**

భద్రాచలం టౌన్
(డీడీ 9 వార్త), సెప్టెంబర్ 9

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అధికారులను ఆదేశించారు. బుధవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని సందర్శించిన పీవో బి.రాహుల్ ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. చిత్రకూట మండపం పరిసరాలు, గోశాల ప్రాంతం, అన్నదాన సత్రం, విస్తా కాంప్లెక్స్ , శివాలయానికి వెళ్లే మార్గం, ఉత్తర ద్వార దర్శనం ప్రాంతం, రామాలయం, మాడవీధులు, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్యులు సూచించిన మేరకు, దేవస్థానం ఆగమశాస్త్ర పండితుల సూచనలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అన్నారు. కాంట్రాక్టర్లు, ఆర్కిటెక్టర్లు సమన్వయంతో పనిచేస్తూ అగ్రిమెంట్ లో పేర్కొన్న గడువు కంటే ముందుగానే పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనుల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వచ్చే ఏడాది జూన్ జూలైలో ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాల నాటికి గోదావరి పరివాహక ప్రాంతంలోని ఘాట్ల నిర్మాణ, అభివృద్ధి పనులను పూర్తిచేయాల





కేసీఆర్ పై విపరీత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- **కేసీఆర్ పై విపరీత వ్యాఖ్యలు చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు: చర్ల మండల బీఆర్ఎస్ నాయకులు**

చర్ల, సెప్టెంబర్ (డిడి 9 వార్త)

ఎన్ని కుట్రలు పన్నిన ప్రశ్నించే గొంతు ఆగడం లేదని తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తానని చెప్పి ఇప్పుడు కేసీఆర్ ని చంపించాలనే దురుద్దేశంతో ఫామ్ హౌస్ పైకి వందలమందిని పంపించిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, నాయకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు రేగ కాంతారావు, నియోజకవర్గ ఇంచార్జి రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ ఆదేశాలతో స్థానిక పోలీస్ స్టేషన్ లో బుధవారం ఫిర్యాదు చేశారు. కేసీఆర్ ని లక్ష్యంగా చేసుకుని కుట్ర జరిగిందని ఫిర్యాదులో ఆరోపించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు ఇతరుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి,సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, కేసీఆర్ భద్రతకు ముప్పు కలిగేల వ్యవహరించిన వారిపై హత్యాయత్నం సహా తగిన చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రత విషయంలో ప్రభుత్వం, పోలీసులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, నియోజకవర్గ యువజన నాయకులు కాకి అనిల్, మండల యూత్ అధ్యక్ష కార్యదర్శులు అంబోజి సతీష్, కుప్పాల నిరంజన్, బీసీ సెల్ అధ్యక్షుడు గోరింట్ల వెంకటేశ్వరరావు, మండల నాయకులు రాట్నాల శ్రీరామ్మూర్తి, గాధంశెట్టి కిషోర్, యువజన నాయకులు ఇన్నమూరి సృజన్, కుక్కడపు సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.




మణుగూరు మున్సిపాలిటీలో గ్రామాలకు తక్షణమే మంచినీరు విడుదల చేయాలి..

- **దుర్గ్యాల సుధాకర్ (సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి).**

మణుగూరు. సెప్టెంబర్ 9 (డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా రోజు విడిచి రోజు మంచినీరు అందించేవారు. గత నాలుగు రోజులుగా గ్రామాలకు మంచినీరు సరఫరా నిలిచి పోవడంతో మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ పేర్కొన్నారు.
బావులు లేక బోరు లేక కేవలం మిషన్ భగీరథ పంపుల ద్వారా వచ్చే నీటినే తాగుతున్నారని, మంచినీరు నాలుగు రోజులుగా రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
పిల్లలకు స్నానాలు చేయించాలన్న, మంచినీరు తాగాలన్న,ఇంట్లో పనులు చేయాలన్న ,మంచినీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని ఎప్పుడు మంచి నీరు వస్తాయో కనీసం ప్రజలకు సమాచారం కూడా లేకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. మున్సిపాలిటీ ద్వారా మంచినీరు అందించలేని పక్షంలో సింగరేణి సంస్థ ట్యాంకుల ద్వారానైనా గ్రామ ప్రజలకు మంచినీరు అందించి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది కానీ ఈ విషయాన్ని ఎవరు పట్టించుకునే పరిస్థితి లేదు.
ఏ రోజుకు ఆరోజే పంపులు వస్తాయని చెబుతూ నాలుగు రోజులు గడిచిన నేటికీ మోటర్ రిపేర్ కాక పోవడంతో త్రాగునీరు అందించడంలో మున్సిపాలిటీ పూర్తిగా విఫలం చెందిందని,ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ శాఖ కమీషనర్ దీనిపై దృష్టి సారించి వెంటనే మోటర్ రిపేర్ చేయించి ,మణుగూరు మున్సిపాలిటీ ప్రజలందరికీ, గ్రామాలకు మంచినీరు అందేలా చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ప్రత్యామ్నాయం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఆధర్ల రాములు, ఏఐటీయూసీ కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, బోశెట్టి సంపత్ తదితరులు పాల్గొన్నారు.




అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుతో అధిక దిగుబడులు

- **రైతుల పంట పొలాలను పరిశీలించిన పత్తి అభివృద్ధి అధికారులు**

డిడి9 వార్త గుడిహత్నూర్ :

ఒక అడుగు దూరం ఉండేలా నాటడం వల్ల పంట సాంద్రత పెరిగి దిగుబడి మెరుగుపడుతుందని తెలిపారు. నాటిన 30 రోజుల తర్వాత మెపిక్వాట్ క్లోరైడ్ వంటి పెరుగుదల నియంత్రకాలను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వినియోగించడం ద్వారా మొక్కల ఎత్తు, కొమ్మల అధిక పెరుగుదలను నియంత్రించి, కాయల ఏర్పాటుకు మొక్కలోని పోషకాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా చేయవచ్చని సూచించారు. అలాగే పురుగుల నివారణకు సిఫార్సు చేసిన క్రిమిసంహారక మందులను మాత్రమే వినియోగించాలని, నానో యూరియా, నానో డీఏపీ వంటి వాటిని సూచించిన విధంగా పిచికారీ చేసి పంటను సంరక్షించుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో , సహాయ సంచాలకులు శ్రీధర్ స్వామి, వ్యవసాయ అధికారులు భగత్ రమేష్, రమణ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు నిలాగ్ రెడ్డి, బాపురాం, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.



ఇషాన్ కిషన్ మరోసారి విధ్వంసం.. ఈస్ట్ జోన్‌కు 584 పరుగుల భారీ ఆధిక్యం

- **దులీప్ ట్రోఫీ ఫైనల్‌పై పట్టు బిగించిన ఈస్ట్ జోన్**
- **విధ్వంసక హాఫ్ సెంచరీతో అదరగొట్టిన ఇషాన్ కిషన్**
- **ఒక్క పరుగు తేడాతో సెంచరీ కోల్పోయిన తిలక్ వర్మ**
- **సౌత్ జోన్‌పై 584 పరుగుల భారీ ఆధిక్యంలో ఈస్ట్ జోన్**
- **రెండో ఇన్నింగ్స్‌లోనూ రాణించి టైటిల్‌ను ఖాయం చేసుకున్న ఈస్ట్**

డీడీ9 వార్త :

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్ జోన్‌పై ఈస్ట్ జోన్ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి తన పట్టును మరింత బిగించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా బుధవారం జరిగిన నాలుగో రోజు ఆటలో, కెప్టెన్ ఇషాన్ కిషన్ (80), శిఖర్ మోహన్ (52) అద్భుతమైన హాఫ్ సెంచరీలతో రాణించారు. దీంతో ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ ఏకంగా 584 పరుగుల భారీ ఆధిక్యం సాధించి, టైటిల్‌ను దాదాపు ఖాయం చేసుకుంది.

ఇషాన్, మోహన్ అద్భుత భాగస్వామ్యం

తొలి ఇన్నింగ్స్‌లో 372 పరుగుల భారీ ఆధిక్యం ఉన్నప్పటికీ, ఈస్ట్ జోన్ ఫాలో ఆన్ విధించకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. అయితే, ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ (8), అభిమన్యు ఈశ్వరన్ (0) విఫలమవడంతో ఆరంభంలో తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్, శిఖర్ మోహన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 170 బంతుల్లో 126 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ తనదైన శైలిలో విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించాడు. కేవలం 98 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 80 పరుగులు చేశాడు. విజయ్ వేసిన ఒకే ఓవర్లో రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 20 పరుగులు రాబట్టి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మరో భారీ షాట్‌కు ప్రయత్నించి కిషన్ ఔటవగా, నిలకడగా ఆడిన శిఖర్ మోహన్ (52) కూడా పెవిలియన్ చేరాడు.

ఒక్క పరుగుతో శతకం చేజార్చుకున్న తిలక్ వర్మ

అంతకుముందు, ఉదయం సెషన్‌లో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌత్ జోన్ 336 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ తిలక్ వర్మ అద్భుత పోరాట పటిమ కనబరిచాడు. అయితే, దురదృష్టవశాత్తూ ఒక్క పరుగు తేడాతో తన తొమ్మిదో ఫస్ట్‌క్లాస్ సెంచరీని చేజార్చుకున్నాడు. 99 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కౌనైన్ ఖరేషీ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిరాశగా వెనుదిరిగాడు. మరో ఎండ్‌లో సీవీ మిలింద్ (43) అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత సౌత్ జోన్ ఇన్నింగ్స్ త్వరగా ముగిసింది. ముఖేష్ కుమార్ 3 వికెట్లతో రాణించాడు.



నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. కుమార్ కుశాగ్ర (34 నాటౌట్), ఖరేషీ (26 నాటౌట్) క్రీజులో ఉన్నారు. చివరి రోజు ఆట నామమాత్రమే కాగా, ఈస్ట్ జోన్ విజయం లాంఛనమేనని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

సంక్షిప్త స్కోర్లు:

ఈస్ట్ జోన్: 708 & 212/5 (ఇషాన్ కిషన్ 80, శిఖర్ మోహన్ 52)

సౌత్ జోన్: 336 (తిలక్ వర్మ 99, ముఖేష్ కుమార్ 3/62)

యూఎస్ ఓపెన్‌లో పెను సంచలనం.. అల్కరాజ్‌కు షాకిచ్చిన షెల్టన్..

- **యూఎస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్‌లో సంచలనం సృష్టించిన బెన్ షెల్టన్**
- **డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాజ్‌పై ఐదు సెట్ల థ్రిల్లర్‌లో విజయం**
- **హోరాహోరీ మ్యాచ్‌పై ప్రశంసలు కురిపించిన భారత క్రికెట్ దిగ్గజం సచిన్**
- **యూఎస్ ఓపెన్ చరిత్రలోనే అత్యంత ఆలస్యంగా ముగిసిన మ్యాచ్‌గా రికార్డ్**
- **సెమీ ఫైనల్‌లో ఫ్రాన్సెస్ టియాఫోతో తలపడనున్న షెల్టన్**

డీడీ9 వార్త :

టెన్నిస్ ప్రపంచంలో పెను సంచలనం నమోదైంది. యూఎస్ ఓపెన్ డిఫెండింగ్ ఛాంపియన్, స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్‌కు అమెరికా యువ కెరటం బెన్ షెల్టన్ భారీ షాకిచ్చాడు. హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్ పోరులో అద్భుతమైన ఆటతీరుతో అల్కరాజ్‌ను మట్టికరిపించి సెమీ ఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. ఈ ఉత్కంఠభరిత పోరుపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించారు.
బుధవారం జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. మొత్తం 4 గంటల 28 నిమిషాల పాటు సాగిన ఈ ఐదు సెట్ల థ్రిల్లర్‌లో షెల్టన్ 67(5), 61, 63, 16, 76(10/7) తేడాతో అల్కరాజ్‌పై విజయం సాధించాడు. నిర్ణయాత్మక ఐదో సెట్ టైబ్రేక్‌కు దారితీయగా, షెల్టన్ తన నరాలపై పూర్తి నియంత్రణతో ఆడి చారిత్రక విజయాన్ని అందుకున్నాడు. 146 మైళ్ల వేగంతో ఏస్ సంధించి మ్యాచ్‌ను ముగించాడు. యూఎస్ ఓపెన్ చరిత్రలోనే అత్యంత ఆలస్యంగా ముగిసిన మ్యాచ్‌గా ఇది రికార్డు సృష్టించింది. ఈ మ్యాచ్ తెల్లవారుజామున 3.33 గంటలకు ముగిసింది. గతంలో ఈ రికార్డు కూడా అల్కరాజ్ (అర్ధరాత్రి తర్వాత 2.50 గంటలకు ముగిసింది) పేరు మీదే ఉండటం గమనార్హం.
ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌ను ఉద్దేశించి భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 'ఎక్స్' వేదికగా స్పందించాడు. "ఇది అద్భుతమైన టెన్నిస్! ఒకరు మ్యాచ్ గెలుస్తారనుకున్న ప్రతిసారీ, మరొకరు అద్భుతంగా పుంజుకున్నారు. చివరికి కొన్ని పాయింట్ల తేడాతో ఫలితం తేలింది. అద్భుతంగా ఆడావు బెన్ షెల్టన్! కార్లోస్, ఇది కఠినమైన ఓటమి. గాయం తర్వాత పునరాగమనం చేసి ఆడటం వల్ల ఇది మరింత కష్టంగా ఉంటుంది" అని పోస్ట్ చేశాడు.



ఈ విజయంతో అల్కరాజ్ 18 మ్యాచ్‌ల గ్రాండ్‌స్లామ్ విజయ పరంపరకు షెల్టన్ అడ్డుకట్ట వేశాడు. ఇది షెల్టన్ కెరీర్‌లోనే అతిపెద్ద విజయంగా నిలిచింది. గాయం కారణంగా సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగిన అల్కరాజ్.. రోజర్ ఫెదరర్ తర్వాత యూఎస్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకున్న ఆటగాడిగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. కానీ, క్వార్టర్స్‌లోనే అతని ప్రయాణం ముగిసింది.
మాంట్రియల్‌లో తన రెండో ఏటీపీ మాస్టర్స్ 1000 టైటిల్ గెలిచి మంచి ఫామ్‌లో ఉన్న షెల్టన్.. 2023 తర్వాత మళ్లీ యూఎస్ ఓపెన్ సెమీ ఫైనల్‌కు చేరుకున్నాడు. సెమీస్‌లో మరో అమెరికన్ ఆటగాడు ఫ్రాన్సెస్ టియాఫోతో తలపడనున్నాడు. వీరిద్దరూ తమ తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ బెర్త్ కోసం పోటీ పడనున్నారు. ఈ విజయంతో ఈ ఏడాది యూఎస్ ఓపెన్‌లో బెన్ షెల్టన్ అతిపెద్ద ఆకర్షణగా నిలిచాడు.

పాండ్యా రీఎంట్రీకి రంగం సిద్ధం.. ఆస్ట్రేలియాతో భారత్-ఏ సిరీస్‌కు స్టార్ ఆల్‌రౌండర్!

- **భారత్-ఏ వన్డే జట్టులో హార్దిక్ పాండ్యాకు చోటు**
- **పాండ్యా రీఎంట్రీ ఫిట్‌నెస్ పరీక్షపై ఆధారపడి ఉంది**
- **ఐదు నెలల తర్వాత తిరిగొచ్చే అవకాశం**
- **బెంగళూరులో పాండ్యాకు ఫిట్‌నెస్ పరీక్ష**
- **ఆస్ట్రేలియా-ఏతో మూడు వన్డేలు ఆడనున్న భారత్-ఏ**

డీడీ9 వార్త :

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు రంగం సిద్ధమైంది. 'ఆస్ట్రేలియా-ఏ'తో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన 'భారత్-ఏ' జట్టులో పాండ్యాకు చోటు దక్కింది. అయితే అతడి రీఎంట్రీ ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గడంపై ఆధారపడి ఉంది.
గాయాల కారణంగా పాండ్యా కొంతకాలంగా క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకానున్నాడు. అందులో పాస్ అయితే ఆస్ట్రేలియా-ఏతో వన్డే సిరీస్‌లో ఆడనున్నాడు. సుమారు ఐదు నెలల తర్వాత పాండ్యా తిరిగొచ్చే అవకాశం ఉంది.
ఆస్ట్రేలియా-ఏతో భారత్-ఏ రెండు నాలుగు రోజుల మ్యాచ్‌లు, మూడు వన్డేలు ఆడనుంది. సెప్టెంబర్ 22 నుంచి పుదుచ్చేరిలో సిరీస్ మొదలవుతుంది. నాలుగు రోజుల మ్యాచ్‌లకు దేవదత్ పడిక్కల్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. వన్డే జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించనున్నాడు. పడిక్కల్ అతడికి డిప్యూటీగా ఉంటాడు.
వన్డే జట్టులో పాండ్యాతో పాటు సాయి సుదర్శన్, రజత్ పాటిదార్, ప్రియాన్ష్ ఆర్య, నమన్ ధీర్ వంటి ఆటగాళ్లకు చోటు దక్కింది. పాండ్యా ఫిట్‌గా తేలితే భారత్-ఏకు అతడి ఆల్‌రౌండ్ సామర్థ్యం అదనపు బలంగా మారనుంది.
వన్డే మ్యాచ్‌లు అక్టోబర్ 6, 9, 11 తేదీల్లో జరగనున్నాయి. పాండ్యా ఫిట్‌నెస్ పరీక్షలో ఎలా రాణిస్తాడన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



కొత్త అధ్యాయాన్ని స్వాగతించేందుకు
సిద్ధంగా ఉన్నా

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ఇటీవల 'మా ఇంటి బంగారం' మూవీతో బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ప్రస్తుతం ఆమె గర్భవతిగా ఉండటంతో కొద్దికాలం పాటు సినిమాలకు దూరంగా ఉంటూ పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్నారు. అయినప్పటికీ సోషల్ మీడియాలో నిత్యం ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్న ఆమె, తన బేబీ బంప్ ఫొటోలతో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో టచ్‌లోనే ఉంటున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, ఈ టాలెంటెడ్ బ్యూటీ ప్రముఖ జాతీయ మీడియా సంస్థ అయిన 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' మ్యాగజైన్ కవర్ పేజీపై చోటు దక్కించుకుని హాట్ టాపిక్‌గా నిలిచారు. ఈ సందర్భంగా.. తన వ్యక్తిగత జీవితంలో రాబోతున్న సరికొత్త మార్పులు, మాతృత్వపు అద్భుతమైన అనుభూతుల గురించి ఆమె మనసు విప్పి మాట్లాడారు. తన జీవితం పూర్తిగా మారిపోవడానికి, సరికొత్త బాధ్యతలను స్వీకరించడానికి తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని సమంత స్పష్టం చేశారు. తన రాబోయే బేబీ బంగారం కోసం ఎంతో ఆతృతగా, ఆనందంగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్న ఆమె, జీవితంలో మొదలుకాబోతున్న ఈ కొత్త అధ్యాయాన్ని ఎంతో సానుకూలంగా స్వాగతించేందుకు సిద్ధంగా ఉన్నాననే భావాన్ని అందరితో పంచుకున్నారు.



స్క్రిప్ట్ సిద్ధం.. చిత్రీకరణ అప్పుడే!

'పెద్ది' సినిమాతో విజయాన్ని అందుకున్నారు కథానాయకుడు రామ్‌చరణ్. ఇప్పుడాయన తన 17వ చిత్రాన్ని దర్శకుడు సుకుమార్‌తో కలిసి పట్టాలెక్కించే ప్రయత్నాల్లో ఉన్నారు. 'రంగస్థలం' విజయం తర్వాత వీళ్లిద్దరి కలయిక నుంచి రానున్న రెండో సినిమా ఇది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయని సమాచారం. డిసెంబరు నుంచి షూటింగ్ మొదలయ్యే అవకాశమున్నట్లు తెలిసింది. ఈలోగా నటీనటులు, సాంకేతిక నిపుణుల్ని ఖరారు చేయనున్నారు. ఇక మరోవైపు ఈ సినిమా కోసం చరణ్ నాజూకైన కొత్త లుక్‌లో కనిపించనున్నారని.. దీనికోసం ఆయన బరువు తగ్గే ప్రయత్నాల్లో ఉన్నారని తెలుస్తోంది. మరి ఈసారి చెర్రీ కోసం సుకుమార్ ఎలాంటి శక్తిమంతమైన కథని.. వైవిధ్యభరితమైన పాత్రని సిద్ధం చేశారో తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు.



తేదీ దగ్గర పడుతోంది!

'సమయం గడిచిపోతోంది.. తేదీ దగ్గర పడుతోంది' అంటూ ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌లో రాబోయే కొత్త సిరీస్ విడుదల తేదీని ప్రకటించింది. బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా ప్రధాన పాత్రలో తెరకెక్కిన సిరీస్ 'షాక్: ట్రస్ట్ నో వన్'. రెన్సిల్ డి సిల్వా దర్శకత్వం వహించారు. సప్న మల్హోత్రా, సిద్ధార్థ్ పి.మల్హోత్రా సంయుక్తంగా నిర్మించారు. ఈ సిరీస్ ఈ నెల 24 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానుంది. ఈ మేరకు సిరీస్ బృందం ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ని పంచుకుంది. జెన్నిఫర్ వింగెట్, అనూప్ సోనీ, సుమిత్ వ్యాస్ తదితరులు ఇందులో కీలకపాత్రలు పోషించారు. రెండేళ్ల కిందట వచ్చిన 'అమిర్‌సింగ్ చమ్కీలా' చిత్రం తర్వాత పరిణీతి.. ఇప్పుడీ మిస్టరీ థ్రిల్లర్‌తో ఓటీటీ ప్రేక్షకుల్ని పలకరించబోతుంది. కనిపించకుండా పోయిన బిడ్డ ఆచూకి కోసం తొమ్మిదేళ్లుగా ఆశ వదులుకోకుండా ఒక తల్లి చేసే భావోద్వేగ ప్రయాణం చుట్టూ తిరిగే కథ ఇదని సిరీస్ వర్గాలు తెలిపాయి.



రెండేళ్ల గ్యాప్ తర్వాత బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చిన నివేదా..



టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ నివేదా థామస్ సెకండ్ ఇన్నింగ్స్‌లో విభిన్నమైన కథలతో అలరిస్తోంది. 2024లో వచ్చిన '35 చిన్న కథ కాదు' చిత్రంతో అద్భుతమైన నటనతో విమర్శకుల ప్రశంసలతో పాటు పలు అవార్డులు అందుకుంది. ఆ తర్వాత కాస్త బొద్దుగా మారడంతో సినిమాలకు కొంతకాలం బ్రేక్ ఇచ్చింది. దీంతో నివేదా ఇండస్ట్రీకి పూర్తిగా దూరం కాబోతుందంటూ ప్రచారం జరిగింది. కానీ ఆ వార్తలకు చెక్ పెడుతూ రెండేళ్ల గ్యాప్ తర్వాత ఓ సరికొత్త ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. తాజాగా, ఈ మూవీ అధికారిక ప్రకటన విడుదల చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. నివేదా ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ లేటెస్ట్ చిత్రానికి 'శ్రీమతి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మూవీ ప్రకటనతో పాటు నివేదా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా మేకర్స్ విడుదల చేశారు.
ఇందులో నివేదా నడుముపై చేయి వేసుకుని కిచెన్ వాతావరణంలో నిల్చుని కనిపించింది. ఆమె పక్కన గరిటె, కాఫీ కప్, వెనకాల గ్యాస్ స్టవ్, వంట పాత్రలు దర్శనమిచ్చాయి. 'ప్రతి ఇంటి హృదయం నుంచీ ఒక కథ ఉద్భవిస్తుంది.. అది మనందరికీ తెలిసిన, మనం ప్రేమించే.. మనం జీవించే కథ' అని మేకర్స్ జత చేసిన క్యాప్షన్ నెటిజన్లను బాగా ఆకట్టుకుంటోంది. కిచెన్ నేపథ్యంలో వస్తున్న ఈ కథ ప్రతి ఇంట్లోని గృహిణుల జీవితాన్ని ఆవిష్కరించబోతోందని సమాచారం. ఒక సగటు ఇల్లాలు అనుభవించే భావోద్వేగాలను ఇందులో ఎంతో సహజంగా చూపించబోతున్నట్లు తెలుస్తోంది. కాగా.. ఈ చిత్రాన్ని 'ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'సతీ లీలావతి' చిత్రంతో మంచి పేరు తెచ్చుకున్న దర్శకుడు విశ్వక్ ఖండేరావు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

ఆ ట్రోల్స్‌కు భయపడి.. అవకాశాలు కూడా వదులుకున్నా

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వచ్చిన 'కింగ్ ఆఫ్ కోథా' (King Of Kotha) పరాజయం తన కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపిందని ప్రముఖ నటి ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించకపోవడం, తన నటనపై వచ్చిన విమర్శలు, ట్రోల్స్ ప్రభావం కెరీర్‌పై పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆ సినిమా పరాజయం తర్వాత ఎదురైన అనుభవాలను పంచుకున్నారు.
"2023లో భారీ అంచనాల మధ్య 'కింగ్ ఆఫ్ కోథా' విడుదలైంది. కానీ ఆ తర్వాత మలయాళ చిత్రపరిశ్రమ నాకు అవకాశాలు ఇవ్వడానికి భయపడినట్లు అనిపించింది. కేవలం నన్ను మాత్రమే కాదు, దుల్కర్‌తో సహా చిత్ర బృందాన్ని కూడా నెటిజన్లు తీవ్రంగా ట్రోల్ చేశారు. నా (Aishwarya Lakshmi) నటన, డైలాగ్ డెలివరీపై ఎన్నో విమర్శలు వచ్చాయి. కొన్నిసార్లు వారు అన్నది నిజమేనేమో అని నాకూ అనిపించేది. నేను అందులో దుల్కర్‌ను 'రాజువెట్టా' అని పిలిచాను. దానిని కూడా చాలా మంది ఎగతాళి చేశారు. 'హలోమమ్మీ' సినిమా షూటింగ్ సమయంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ నన్ను పిలిచి మరీ వెక్కిరించారు. ఆ సమయంలో చాలా బాధపడ్డాను. ఆ తర్వాత దుల్కర్‌తో (Dulquer Salmaan) కలిసి ఓ వాణిజ్య ప్రకటనలో నటించే అవకాశం వచ్చింది. కానీ, ట్రోలింగ్ దెబ్బకు భయపడి వదులుకున్నాను. 'నేను నటిస్తే దారుణంగా విమర్శలు వస్తాయి. అది మీకే సమస్య కావచ్చు' అని చెప్పి ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించా. ఆ సినిమా ట్రోల్స్ నన్ను అంతగా ప్రభావితం చేశాయి" అని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. అభిలాష్ జోషి దర్శకత్వంలో రూ. 50 కోట్లతో తెరకెక్కిన 'కింగ్ ఆఫ్ కోథా' చిత్రం థియేటర్లలో ఆశించిన స్థాయిలో అలరించలేక పోయింది. ఈ ప్రభావం తన మానసిక ధైర్యాన్ని దెబ్బతీసిందని ఐశ్వర్య లక్ష్మి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె సాయి దుర్గా తేజ్‌కు జోడీగా 'సంబరాల ఏటి గట్టు' సినిమాలో నటిస్తున్నారు.

'మంజనత్తి'లో భాగమైనందుకు ఎంతో గౌరవంగా భావిస్తున్నాను

తెలుగు, తమిళ, కన్నడ మలయాళ ఇలా అన్ని భాషల్లోనూ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతోంది యంగ్ బ్యూటీ కాయదు లోహర్. 'ఇమ్మోర్టల్', 'ఐయామ్ గేమ్' చిత్రాల తర్వాత ఈ భామ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను తన ఖాతాలో వేసుకుంది. టాలెంటెడ్ డైరెక్టర్ మారి సెల్వరాజ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న 'మంజనత్తి' మూవీలో ఆమె కీలక పాత్రకు ఎంపికైంది. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్, పూర్ణిమ రవి, కదిర్ కూడా కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ కూడా లాంఛనంగా ప్రారంభమైంది. తాజాగా, కాయదు ఈ సినిమా గురించి ఓ షాకింగ్ పోస్ట్ పెట్టింది. "మనుషులను ఎప్పుడూ ఎవరో ఒకరు గమనిస్తూ ఉండటంలోనే ఒక రకమైన హింస దాగుంటుంది. అది ఎవరి మీదైనా కోపంతో చేసేది కాకపోవచ్చు, కనీసం మాట్లాడకుండా కేవలం నిరంతరం కనిపెట్టుకుని చూడటమే ఆ హింస. మనం ఎలా బతకాలో సమాజమే కొన్ని అదృశ్యమైన రూల్స్ పెట్టి వాటితో మనల్ని కొలుస్తూ ఉంటుంది. అణచివేత ఎప్పుడూ అలాగే బతుకుతుంది. ఎవరినీ బలవంతంగా లొంగదీయాల్సిన పనిలేదు. అలా లొంగి ఉంటేనే మీకు భద్రత దొరుకుతుందని నమ్మిస్తే చాలు, అదే అణచివేతను ముందుకు నడిపిస్తుంది.

దీపావళికి మహాశక్తి?

టాక్సిక్', 'హాయ్' చిత్రాలతో ఇటీవల థియేటర్లలో ప్రేక్షకుల్ని అలరించారు అగ్ర కథానాయిక నయనతార. ఇప్పుడామె మరో చిత్రంతో సినీ ప్రియుల్ని పలకరించేందుకు సన్నద్ధమవుతున్నారని సమాచారం. నయనతార ప్రధాన పాత్రలో 'మూకుతి అమ్మన్ 2' చిత్రం పట్టాలెక్కుతోన్న సంగతి తెలిసిందే. తెలుగులో మహాశక్తి అనే పేరుతో రానుందీ చిత్రం. సుందర్.సి దర్శకత్వంలో రూపొందుతుంది. డా.ఇషారి కె.గణేశ్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాని దీపావళి పండగ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోందని తమిళ చిత్రవర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రీ ప్రొడక్షన్ పనులు చేసుకుంటున్న ఈ చిత్రంలో రెజీనా, యోగిబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.